# ఖమ్మం - భద్రాద్రి కొత్తగూడెం



# వార్త

మంగళవారం 11, ఆగస్టు 2026 16 పేజీలు








## మోడీ తీరు మారకుంటే పతనమే

**కార్పొరేట్, సంపన్నుల సేవలో కేంద్ర సర్కార్**

**అఖిలపక్ష రైతు, కార్మిక సంఘాల నేతలుఖమ్మంలో విజయవంతమైన జైల్ భరో**

**వందలాది మంది అరెస్టు**

ఖమ్మం బ్యూరో,ప్రభాతవార్త:

మోడీ తీరు మారకుంటే పతనం తప్పదని అఖిలపక్ష రైతు, కార్మిక సంఘాల నేతలు హెచ్చరించారు. కార్మిక హక్కులను హరించి వేస్తూ లేబర్ కోడ్లను




## జైల్ భరోతో దద్దరిల్లిన భద్రాచలం

**-కార్మిక, కర్షక హక్కుల కోసం భారీ రాస్తారోకో**

**-ఐదు కి.మీ. మేర స్తంభించిన రాకపోకలు..**

భద్రాచలం,ఆగస్టు 10 (ప్రభాతవార్త):










## సీతారామా అనుమతులపై మళ్ళీ..

**ఆంధ్రా అభ్యంతరాలు**

**సమ్మక్క బ్యారేజ్‌ని పూర్తిగా ఆపాలని డిమాండ్**

**ఈ వ్యూహాత్మక దూకుడులోని ఆంతర్యమేమి**

**ఐదు ప్రాజెక్ట్‌ల అప్రూవల్స్ తిరిగి పరిశీలించాలట**

**వీటికి ఎప్పుడో సిడబ్ల్యుసి అమోదం లభించింది**

**జలవనరుల సంఘ ఆర్డర్లపై రివ్యూ చేసే అధికారం ఉన్నదా**

**ఈనెల 18న హైద్రాబాద్‌లో జిఆర్ఎంబి ప్రత్యేక సమావేశం**

**రాష్ట్ర ప్రభుత్వం బహిష్కరించాలని బిఆర్ఎస్ డిమాండ్**

అశ్వారావుపేట/ప్రభాతవార్త



# వ్యవసాయ మోటార్లు.. ట్రాన్స్‌ఫార్మర్లే లక్ష్యం

## కాపర్ వైర్ల చోరీ ముఠా అరెస్టు నలుగురు నిందితుల పట్టివేత.. 10 మోటార్లు, 100 కిలోల కాపర్ వైర్లు స్వాధీనం

ప్రభాత వార్త , ఖమ్మం రూరల్:

రైతుల వ్యవసాయ బావుల వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ మోటార్లు, స్టార్టర్ బాక్సులు, ట్రాన్స్ ఫార్మర్లను ధ్వంసం చేసి అందులోని కాపర్ వైర్లను అపహరిస్తున్న ముఠాను ఖమ్మం రూరల్ పోలీసులు పట్టుకున్నారు. ఈ కేసులో నలుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద నుంచి 10 విద్యుత్ మోటార్లు, సుమారు 100 కిలోల కాపర్ వైర్లు, నేరాలకు ఉపయోగించిన బజాజ్ ఆర్‌ఈ ఏప్ ఆటోను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఖమ్మం రూరల్ మండలంతోపాటు పరిసర ప్రాంతాల్లోని వ్యవసాయ పొలాలను నిందితులు లక్ష్యంగా



చేసుకున్నారు. రాత్రివేళల్లో రైతుల బావుల వద్దకు చేరుకుని విద్యుత్ మోటార్లు, స్టార్టర్ బాక్సులు, ట్రాన్స్ ఫార్మర్లను ధ్వంసం చేసేవారు. వాటిలోని విలువైన కాపర్ వైర్లను తొలగించి తీసుకెళ్లేవారు. అనంతరం చోరీ చేసిన మోటార్లు, కాపర్ వైర్లను విక్రయించి వచ్చిన నగదును వ్యక్తిగత అవసరాలకు వినియోగించినట్లు విచారణలో వెల్లడైంది.

పలు ప్రాంతాల్లో చోరీలువిచారణలో నిందితులు గత కొంతకాలంగా ఖమ్మం రూరల్, నేలకొండపల్లి, తల్లాడ, ఖమ్మం అర్బన్, ఖమ్మం రెండో పట్టణం, చింతకాని, కొణిజర్ల, వెంసూరు తదితర ప్రాంతాల్లో ఇలాంటి చోరీలకు పాల్పడినట్లు వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు. రైతుల వ్యవసాయ బావుల వద్ద ఎవరూ లేని సమయాన్ని గమనించి చోరీలకు పాల్పడినట్లు పేర్కొన్నారు.

### నలుగురు అరెస్టు

అరెస్టైన వారిలో ఖమ్మంలోని రమణగుట్టకు చెందిన అంగులూరి ఏసుపాల్ (30), రహమత్‌నగర్‌కు చెందిన షేక్ మహ్మద్ రఫీ (19), రమణగుట్ట వికలాంగుల కాలనీకి చెందిన పొగరత్తి వెంకటేష్ (32), ఖమ్మం టేకులపల్లిలోని కేటీఆర్ టవర్స్‌కు చెందిన వెండి రాము (26) ఉన్నారు. నిందితుల నుంచి 10 విద్యుత్ మోటార్లు, సుమారు 100 కిలోల కాపర్ వైర్లు, చోరీలకు వినియోగించిన బజాజ్ ఆర్‌ఈ ఏప్ ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితులను అరెస్టు చేసి న్యాయస్థానం ఎదుట హాజరుపరచగా రిమాండ్‌కు తరలించినట్లు ఖమ్మం రూరల్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం. రాజు తెలిపారు. కేసుకు సంబంధించి తదుపరి దర్యాప్తు కొనసాగుతోందన్నారు.




## ధాన్యం మళ్లింపు కేసులో వ్యాపారి అరెస్ట్

తల్లాడ ఆగస్టు 10 :ప్రభాతవార్త

ధాన్యం పక్కదారి పట్టించారని ఆరోపణలపై సివిల్ సప్లై డ్యూటీ ఫిర్యాదు మేరకు వ్యాపారి నరసింహారావు పై పోలీసులు కేసు నమోదు చేసుకొని సోమవారం రిమాండ్ కు తరలించారు. మిల్లులోని బియ్యాన్ని ప్రభుత్వానికి సరఫరా చేయకుండా దారి మళ్ళించారని ఆరోపణలపై విజిలెన్స్ అధికారులు తనిఖీ చేసి ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని రిమాండ్ కు తరలించారు దాదాపు 24 వేల ఐదు వందల బస్తాలు పక్కదారి పట్టాయని ఫిర్యాదులు పేర్కొన్నారు

## తల్లాడ లో జైల్ భరో సక్సెస్

తల్లాడ ఆగస్టు 10 ప్రభాతవార్త



కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక రైతు ప్రజా వ్యతిరేక విధానాల నిరసిస్తూ దేశవ్యాప్తంగా కేంద్ర కార్మిక సంఘాలు ఎస్కేయం సంయుక్తంగా జరిపార కార్యక్రమానికి పిలుపునిచ్చిన సందర్భంగా తల్లాడలో సోమవారం భారీ ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి ప్రదర్శనగా బస్టాండుక్కు చేరుకొని బస్టాండ్ ఎదుట రాస్తారోకో నిర్వహించారు సిపిఎం సిఐటియు రైతు వ్యవసాయ కార్మిక సంఘాలు పాల్గొన్నాయి అర్ధగంటకు పైగా ట్రాఫిక్ స్తంభించింది రాస్తారోకో చేసిన వారిని ఎస్సై వెంకటకృష్ణ పోలీస్ స్టేషన్కు తరలించారు రైతు సంఘం రాష్ట్ర నాయకులు సేలం పకీరమ్మ జిల్లా నాయకులు సేలం సత్యనారాయణ రెడ్డి డివిజన్ అధ్యక్షులు నల్లమోతు మోహన్రావు సిఐటియు జిల్లా నాయకులు సత్తెనపల్లి నరేష్ వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి పులి కృష్ణయ్య సిఐటియు మండల నాయకులు షేక్ మస్తాన్ చిర్రా లింగయ్య ఆశ వర్కర్స్ సీనియర్ నాయకులు తాళ్ల రాణి గుడిపల్లి కృష్ణ దాడిపల్లి నరేష్ ట్రాన్స్పోర్ట్ నాయకులు దూళ్ల ప్రభాకర్ కళ్యాణం కృష్ణయ్య మన్నేపల్లి రామారావు వాయినాలు రామలింగేశ్వర చల్ల నాగేశ్వరరావు షేక్ నమ్మేసాయ జీవరత్నం సురేష్ తదితరులు పాల్గొన్నారు,

## రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ కు హాజరుకండి

కామేపల్లి, ఆగస్టు 10 ప్రభాతవార్త :

కామేపల్లి, పాత లింగాల రైతు వేదికలో మంగళవారం ఉదయం 10 గంటల నుండి రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి భూక్య తారా దేవి సోమవారం తెలిపారు.

# నూతన పంచాయతీ కార్యాలయం ప్రారంభం

మణుగూరు, ప్రభాత వార్త, ఆగస్టు10:

మణుగూరు మండలం కట్టుమల్లారం గ్రామంలో రూ.20 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ కార్యాలయ భవనాన్ని సోమవారం పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, నూతన భవనం అందుబాటులోకి రావడంతో పరిపాలన మెరుగై ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువవుతాయని పేర్కొన్నారు. గ్రామాభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల, టౌన్ అధ్యక్షులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ ఆపదలో ఉన్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో అండగా నిలుస్తుందని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మణుగూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం పినపాక, మణుగూరు మండలాలకు చెందిన లబ్ధిదారులకు రూ.5.20 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్



చెక్కులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం మాట్లాడుతూ, అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధితులకు ఈ సాయం ఎంతో ఊరటనిస్తుందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



రూ.5 లక్షల ఎల్‌ఓసీ అందజేమణుగూరు మండలం రాజీవ్ గాంధీ నగర్‌కు చెందిన పొట్టురి బాలకృష్ణ వైద్య చికిత్స నిమిత్తం ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.5 లక్షల విలువైన ఎల్‌ఓసీ పత్రాన్ని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సోమవారం క్యాంపు కార్యాలయంలో అందజేశారు. పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం ఎల్‌ఓసీలు, సీఎంఆర్ఎఫ్ ద్వారా సహాయం అందిస్తోందని ఆయన తెలిపారు. ప్రజల సమస్యలు తన దృష్టికి తెస్తే పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# దేశ, రాష్ట్ర ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలి

## మంచి వర్షాలు కురవాలని ఆకాంక్షిస్తూ వరుణ యాగం

నాగార్జునసాగర్ ప్రభాతవార్త ఆగస్టు 10

యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని నలుమూలల నుండి వచ్చిన 108 మంది రుత్వికులు, అర్చకుల ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 4 గంటల 5 నిమిషాలకు రాష్ట్ర నీటిపారుదల పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్ ఉత్తంకుమార్ రెడ్డి దంపతుల చేతుల మీదుగా వరుణ యాగం ప్రారంభమైంది. ఈ



వరుణయోగం సోమవారం సాయంత్రం 3 గంటల 24 నిమిషాలకు పూర్ణాహుతితో ముగిసింది. ఋత్వికులు, అర్చకులు గోపూజతో యాగాన్ని ప్రారంభించి, యాగ ప్రదక్షిణము, పుణ్యా వచనం, అంకురార్పణం, ఋష్యశృంగ పూజ, తదితర పూజలతో వేదమంత్రాల మధ్య



సాగిన వరుణయాగం వర్షాలు సమృద్ధిగా కురవాలని నిర్వహించడం జరిగింది. కృష్ణానది ఒడ్డున చతుర్విధ పారాయణం తో నిర్వహించిన ఈ యాగం లో రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి దంపతులు పూర్ణాహుతి కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం, జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి దంపతులకు పూర్ణకుంభంతో, యాగశాల వద్దకు మేళా తాళాల తో ఘన స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి దంపతులు వరుణ యాగం లో పాల్గొని పూర్ణాహుతి గావించి యాగాన్ని ముగించారు. అంతకుముందు సాగర్ చేరుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రికి బి సి సంక్షేమ పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్ద రాష్ట్ర రోడ్లు భవనాలు సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, మాజీ మంత్రి జానారెడ్డి, పలువురు. ఇతర ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్,జిల్లా ఎస్ పి శరత్ చంద్ర పవర్ లు పుష్పగుచ్చాలతో స్వాగతం పలికారు. కృష్ణ తీరం ఆధ్యాత్మిక శోభన సంతరించుకుంది కృష్ణా గోదావరి



నదులు పరవాలు తొక్కాలని జలాశయాలు నిండాలని రైతుల మొహాల్లో ఆనందం మెరవాలని సంకల్పిస్తూ 108 మంది రితికులు వేద పండితులు యజ్ఞం చేశారు ఈ వరుణ యాగంలో రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి దంపతులు, రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ,రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య,మరో విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, శాసనమండలి సభ్యులు, శాసనసభ్యులు శంకర్ నాయక్,రాష్ట్ర డైరీ డెవలప్మెంట్ చైర్మన్ గుత్త అమిత్ రెడ్డి ,ప్రభుత్వ సలహాదారు లు కే కేశవ రావు ,సుదర్శన్ రెడ్డి ,మాజీ మంత్రి జనా రెడ్డి, రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, జిల్లా కలెక్టర్ బి.చంద్ర శేఖర్,ఎస్ పి శరత్ చంద్ర పవార్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్,స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, నాగార్జున సాగర్ ఎం ఎల్ ఏ కుందూరు జయవీర్ రెడ్డి, ఆలేరు,భువనగిరి,తుంగతుర్తి,మిర్యాలగూడ,దేవరకొండ శాసనసభ్యులు బీర్ల ఐలయ్య, కుంభం అనిల్ కుమార్ రెడ్డి, మందుల సామేలు, బత్తుల లక్ష్మారెడ్డి , బాలునాయక్,కార్పొరేషన్ చైర్మన్లు,మున్సిపల్ చైర్మన్లు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# 12వ వేజ్ బోర్డును వెంటనే ఏర్పాటు చేయాలి

### జేఏసీ ఆధ్వర్యంలోఏరియా
### జీఎం కార్యాలయం ముందు ధర్నా

**సత్తుపల్లి ఆగస్టు 10 ప్రభాతవార్త**

12వ వేజ్ బోర్డు వేతన కమిటీని తక్షణమే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం సత్తుపల్లి సింగరేణి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ, 11వ వేజ్ బోర్డు పదవీకాలం ఈ ఏడాది జూన్ నెలతో ముగిసినప్పటికీఇప్పటివరకు 12వ వేజ్ బోర్డు కమిటీని ఏర్పాటు చేయకపోవడం కేంద్ర ప్రభుత్వ నిరక్ష్య వైఖరికి నిదర్శనమని విమర్శించారు. జాతీయ



కార్మిక సంఘాల పిలుపు మేరకు దేశవ్యాప్తంగా కోల్ ఇండియా సంస్థల పరిధిలో చేపట్టినఆందోళన కార్యక్రమాల్లో భాగంగానే సత్తుపల్లి ఏరియాలో ఈ ధర్నా నిర్వహించినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని చూస్తున్న కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులహక్కులు, సంక్షేమాన్ని పరిరక్షి ంచే విధంగా కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. అనంతరం 12వ వేజ్ బోర్డు వేతన కమిటీని వెంటనే ఏర్పాటు చేయాలని కోరుతూ సత్తుపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎస్ వెంకటాచారికి జేఏసీ నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ సముద్రాల సుధాకర్, ఐఎన్టీయూసీ వైస్ ప్రెసిడెంట్ బి.కోటేశ్వరరావు, హెచ్ఎంఎస్ వైస్ ప్రెసిడెంట్ ఆంజనేయులు, సీఐటీయూ నాయకులు గిడ్డయ్యతో పాటు వివిధ కార్మిక సంఘాల నాయకులు, కార్యకర్తలు, డీఎల్ఆర్ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## బొగ్గు పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

### కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి ఆల్ ఇండియా
### కోల్ పెన్షనర్స్ ఫెడరేషన్ వినతి

**కొత్తగూడెం, ఆగస్టు 10 ప్రభాతవార్త:**

బొగ్గు పెన్షనర్ల సమస్యలను పరిష్కరించి, ప్రతినెలా నిర్ణీత సమయానికి పెన్షన్ అందేలా చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా కోల్ పెన్షనర్స్ ఫెడరేషన్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు ఫెడరేషన్ ప్రతినిధులు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు పులి రాజా రెడ్డి, ప్రధాన కార్యదర్శి రమేష్ రాజమ్ బల్లేవార్, కార్యాధ్యక్షుడు ఆర్.ఎస్. సింగ్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం పెన్షనర్ల సమస్యలపై సమావేశంలో ఆమోదించిన తీర్మానాల ప్రతులను మంత్రికి అందజేసింది. ముఖ్యంగా పెన్షన్లు సకాలంలో జమ కాకపోవడం వల్ల వేలాది మంది రిటైర్డ్ బొగ్గు కార్మికులు, వారి కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించింది. పెన్షన్ చెల్లింపు వ్యవస్థను మెరుగుపరిచి ప్రతి నెలా నిర్ణీత తేదీలో పెన్షన్ అందేలా చర్యలు తీసుకోవాలని, పెండింగ్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరింది. సమస్యలను సీరియస్‌గా విన్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సంబంధిత అంశాలపై తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఫెడరేషన్ తెలిపింది. ఈ కార్యక్రమంలో ఏబికేఎంఎస్ బిఎంఎస్ కార్యదర్శి, నేషనల్ డస్ట్ ప్రివెన్షన్ కమిటీ సభ్యులు పి. మాధవ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



## నూతన జిఎంని సన్మానించిన సింగరేణి ఉద్యోగులు

**సత్తుపల్లి ఆగస్టు 10 ప్రభాతవార్త**



సత్తుపల్లి సింగరేణి ఏరియా నూతన జనరల్ మేనేజర్ గా బాధ్యతలు చేపట్టిన సిరికొండ వెంకటా చారి ని సింగరేణి గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించడం జరిగింది. ఏరియా కమిటీ సభ్యులు హాజరై, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు సింగరేణి గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం కొత్తగూడెం ఏరియారి జిస్టర్ నెంబర్ 7856/2001 తరపున ధారా భీమయ్య, సునా వత్వత్ రమేష్, భాస్కర్, మోతిలాల్, తిరుమల్ రావు, పాల్గొన్నారు.

## బొల్లం వెంకమ్మ కు నివాళులర్పించిన కల్లూరు మున్సిపల్ చైర్మన్

**కల్లూరు, ఆగస్టు 10, ప్రభాతవార్త**



కల్లూరు మున్సిపాలిటీలోని పుల్లయ్య బంజర రోడ్డు కు చెందిన టీడీపీ నాయకులు మీసాల కృష్ణ మాతృమూర్తి , కాంగ్రెస్ యువ నాయకుడు బొల్లం ఉపేందర్ గౌడ్ నాయనమ్మ ఇటీవల మృతిచెందటంతో సోమ్మవారం జరిగిన దశదినకర్మ కార్యక్రమం లో కల్లూరు మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్ పాల్గొని వెంకమ్మ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఆమె ఆత్మకు శాంతి కలగాలని, కుటుంబ సభ్యులందరికీ మనోధైర్యం కలగాలని కోరారు. మండల అధ్యక్షులు పోట్రు అర్జున్ రావు, భాగం ప్రభాకర్ చౌదరి, టౌన్ ప్రెసిడెంట్ ఉస్మాన్, కాంగ్రెస్ కార్యకర్తలు, కౌన్సిలర్స్ నాయకులు, కల్లూరు మున్సిపల్ కౌన్సిలర్స్, టౌన్ కాంగ్రెస్ ప్రెసిడెంట్, నాయకులు పాల్గొన్నారు.

## పశువుల తో ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు

**కల్లూరు, ఆగస్టు 10, ప్రభాతవార్త**

జాతీయ రహదారిపై వదిలిపెట్టిన పశువుల తో ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పశువుల యజమానులకు నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకోవాలని మున్సిపాలిటీ కమిషనర్, మేనేజర్ ను ప్రజలు కోరుతున్నారు.



## గంగారం హైస్కూల్లో 2008 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం

**సత్తుపల్లి ఆగస్టు 10 ప్రభాతవార్త**



సత్తుపల్లి మండలం గంగారం గ్రామంలోని దాసరి వీరారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 10వ తరగతి 2008 బ్యాచ్ పూర్వ విద్యార్థులు దాదాపు 18 సంవత్సరాల తర్వాత సోమవారంపాఠశాల ప్రాంగణంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. చిన్ననాటి స్నేహితులు, సహఉపాధ్యాయులు చాలాకాలం తర్వాత ఒకే వేదికపై కలుసుకోవడంతో పాఠశాల ప్రాంగణం సందడిగా మారింది. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ నాటి పాఠశాల జ్ఞాపకాలనునెమరువేసుకున్నారు. విద్యార్థి దశలో కలిసి గడిపిన మధుర క్షణాలను గుర్తుచేసుకుని ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు తమ పాఠశాల, ఉపాధ్యాయులతో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. పాఠశాలలో తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను స్మరించుకుంటూ, వారి సేవలకు కృతజ్ఞతలు తెలిపారు. దాదాపు రెండు దశాబ్దాల తర్వాత జరిగిన ఈ ఆత్మీయ సమ్మేళనం పూర్వ విద్యార్థుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. పాత స్నేహాలనుపునరుద్ధరించుకోవడంతోపాటు, భవిష్యత్తులోకూడాఇలాంటిసమావేశాలను నిర్వహించుకోవాలని పూర్వవిద్యార్థులుఆకాంక్షి ంచారు.

# పెనుబల్లి లో జైల్ భరో సక్సెస్

**పెనుబల్లి, ఆగస్టు 10, ప్రభాతవార్త**

కార్మిక, రైతు, వ్యవసాయ కూలీ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ క్విట్ ఇండియా స్ఫూర్తితో సోమవారం పెనుబల్లి మండల కేంద్రంలో వి.ఎం బంజర్ రింగ్ సెంటర్ కేంద్రంలో నిర్వహించిన జైల్ భరో కార్యక్రమం సక్సెస్ అయిందని సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు చలమాల విఠల్ రావు అన్నారు. వియం బంజర్ అంబేద్కర్ సెంటర్ నుండి సిఐటియు వ్యవసాయ కార్మిక సంఘం రైతు సంఘాల ఆధ్వర్యంలో వందలాదిమంది ప్రజలతో ర్యాలీ నిర్వహిస్తూ నాలుగు లేబర్ కోడ్లను తక్షణమే రద్దు చేయాలని, విద్యుత్ సంస్కరణ బిల్లును వెనక్కి తీసుకోవాలని, విద్యుత్తును ప్రైవేటీకరణ నిలుపుదల చేయాలని, స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించి కనీస వేతనం అమలు చేయాలని, ఇవి బీజీ రాంజీ



చట్టాన్ని రద్దు చేసి, గతంలో ఉన్న చట్టాన్ని అమలు చేయాలని, ప్రతి కార్మికుడికి 200 రోజులు పని కల్పించాలని, రోజుకూలి 700 రూపాయలు ఇవ్వాలని నినదిస్తూ ప్రశాంతంగా ప్రదర్శన సాగుతున్న పోలీసు వారు అరెస్టు చేయటం జరిగింది. గాంధీ సెంటర్ నుండి పోలీస్ స్టేషన్ వరకు సుమారు 250 మంది కార్మికులు ప్రజలను స్టేషన్ కు తీసుకువెళ్లి, పూచికత్తు పై విడుదల చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు చలమాల విఠల్ రావు, వ్యవసాయ కార్మిక సంఘం ఖమ్మం జిల్లా కమిటీ సభ్యులు గాయం తిరపతి రావు, రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు చిట్టి మొదల కృష్ణయ్య, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి చెమట విశ్వనాథం, సిఐటియు మండల కన్వీనర్ గుడిమెట్ల బాబు, మహిళా సంఘం మండల కార్యదర్శి మిట్టపల్లి నాగమణి, ప్రజానాట్యమండలి డివిజన్ అధ్యక్షులు కంటే సత్యం, హమాలీ యూనియన్ నాయకులు మిద్దె స్వామి, అన్నపరెడ్డి లక్ష్మయ్య, గుజ్జ వెంకటేశ్వర్లు, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు భూక్య ప్రసాద్, రైతు సంఘం నాయకులు చలమాల నరసింహారావు, సిఐటియు నాయకులు రవీంద్ర, గుంటూరు వెంకటేశ్వరరావు, శ్రీను, జొన్నలగడ్డ రమణయ్య, వ్యవసాయ కానివి సంఘం నాయకులు రాజనేని మంగమ్మ, వడ్డెక బజారు, చిలక రమణ, నల్లబోతుల భారతి, తదితరులు పాల్గొన్నారు.




# న్యాయ శిఖరం పుంజాల శివశంకర్ జయంతి వేడుకలు

**ఖమ్మం అర్బన్, ఆగస్టు 10 (ప్రభాతవార్త):**

పుంజాల శివశంకర్ 97వ జయంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. మున్నూరు కాపు జిల్లా అధ్యక్షులు శీలంశెట్టి వీరభద్రం అధ్యక్షతన ఘనంగా నిర్వహించినారు. ముందుగా పుంజాల శివశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం బిసి సంఘాల ఆధ్వర్యంలో జరిగిన సభలో మున్నూరు కాపు పెద్దలు, బిసి సంఘాల నాయకులు మాట్లాడుతూ...శివశంకర్ వెనుకబడిన జాతుల హక్కుల కోసం, రిజర్వేషన్ల కోసం జీవితాంతం పోరాడారని ఆయన చూపిన తెగువ, నిబద్ధత ఈరోజు మనందరికీ స్ఫూర్తిదాయకమని, న్యాయశిఖరం పుంజాల శివశంకర్ బిఏ హిందూ కాలేజ్ అమృత్సర్లో పిజి ఉస్మానియా యూనివర్సిటీలో లా పూర్తిచేశారని మొట్టమొదటిసారిగా మున్సిపాలిటీలో క్లర్క్గా పనిచేస్తూ 1972లో ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారని అప్పట్లో దేశంలోని అతి చిన్న వయసు న్యాయమూర్తిగా రికార్డు సాధించారని 1973లో న్యాయమూర్తి పదవికి రాజీనామా చేసి తొలి భారతీయ



న్యాయమూర్తిగా చరిత్ర సృష్టించారని 1979లో సికింద్రాబాద్ నుండి లోకసభ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున గెలిచి పార్లమెంట్లో అడుగు పెట్టారని 1980లో మళ్ళీ సికింద్రాబాద్ నుండి గెలిచి కేంద్రమంత్రి న్యాయశాఖమంత్రి, పెట్రోలియం శాఖమంత్రి పదవులు విదేశాంగ మంత్రి, మంత్రులుగా కొనసాగారని, సిక్కిం గవర్నర్, కేరళ గవర్నర్ పదవులను రెండు పర్యాయాలు చేశారని వారిని వారి జయంతి సందర్భంగా గుర్తు చేసుకోవడం చాలా అవసరమని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శెట్టి రంగారావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకుల గాంధీ, ముఖ్య నాయకులు కనకం జనార్దన్‌రావు, పసుపులేటి దేవేందర్, మదూరి పూర్ణచందర్ రావు, పసుపులేటి నాసరయ్య, పారా నాగేశ్వరావు, పొన్నం వెంకటేశ్వరావు, తోట రామారావు, జాబిశెట్టి పాపారావు, మేకల సుగుణ రావు, జక్కుల లక్ష్మయ్య, పెండ్లూరి విజయ కుమార్, సోమరాజు, మెరుగు వెంకట రమణ, నాగరాజు, సోమయ్య, చామకూరి వెంకట నారాయణ, కోనేటి నారాయణ, గంగిశెట్టి శ్రీనివాస్, బొమ్మిశెట్టి రమేష్, బొమ్మిశెట్టి హనుమంతరావు, బైరిశెట్టి శ్రీనివాస్, బొమ్మిశెట్టి శ్రీనివాస రావు, నాంపల్లి శంకరయ్య మరియు జి వి వి ఎల్ నరసింహరావు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమకారుల గుర్తింపు వేగవంతం చేయాలి

**-లక్షమంది ఉద్యమకారులకు న్యాయం చేయండి**

**మళ్లీ కాంగ్రెస్‌ను అధికారంలోకి తెస్తాం**

**-డా.పిడమర్తి రవి, డా. కె.వి. కృష్ణారావు**

**ఖమ్మం గాంధీచౌక్, ఆగస్టు 10 (ప్రభాతవార్త):**

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం రెండు తరాలుగా పోరాడిన ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియను ప్రభుత్వం వేగవంతం చేయాలని తెలంగాణ ఉద్యమకారులు డా. పిడమర్తి రవి, డా. కె.వి. కృష్ణారావు డిమాండ్ చేశారు. సుమారు లక్ష మంది ఉద్యమకారులను గుర్తించి వారికి న్యాయం చేయాలని కోరారు. ఖమ్మంలోని చిన్నారి హాస్పిటల్ డైరెక్టర్ కార్యాలయంలో రెండు తరాల తెలంగాణ ఉద్యమకారుల 'అపూర్వ సమ్మేళనం' కరపత్రాన్ని నాయకులతో కలిసి వారు ఆవిష్కరించారు. 1969 నుంచి 2009 వరకు ఉద్యమంలో



పాల్గొన్న అమరవీరుల కుటుంబ సభ్యులు, గాయపడిన వారు, జైలు పాలైన వారు, ఉద్యమాన్ని నడిపిన వారు, ఉద్యమ సంఘాలను ఏర్పాటు చేసిన వారందరినీ గుర్తింపు జాబితాలో చేర్చాలని పిడమర్తి రవి కోరారు. గుర్తింపు పొందిన ఉద్యమకారులకు 250 చదరపు గజాల స్థలం, పెన్షన్, గుర్తింపు కార్డులు అందించాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారులకు న్యాయం చేస్తే కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచి, మళ్లీ అధికారంలోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. సెప్టెంబర్ 16న హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో నిర్వహించనున్న రెండు తరాల తెలంగాణ ఉద్యమకారుల అపూర్వ సమ్మేళనానికి 1969–2009 ఉద్యమకారులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు దేవిరెడ్డి విజయ్, మట్టి గురుమూర్తి, జిల్లా విజయ్, రాకేష్, భూక్య హరినాయక్ తదితరులు పాల్గొన్నారు

# డిసిసి కార్యాలయంలో గోరింటాకు వేడుకలు

**ఖమ్మం ఆగస్టు 10 (ప్రభాత వార్త):**

జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డిభవన్‌లో జిల్లా మహిళా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య ఆధ్వర్యంలో ఆషాఢమాసమును పురస్కరించుకొని గోరింటాకు పండుగ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ హాజరయ్యారు. జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డిభవన్‌లో సోమవారం జిల్లా మహిళా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య ఆధ్వర్యంలో ఆషాఢమాసమును పురస్కరించుకొని గోరింటాకు పండుగ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..తెలంగాణ ఆచారాలలో భాగంగా ఆషాఢమాసమును పురస్కరించుకొని గోరింటాకు పండుగ నిర్వహించిన మహిళా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్యను కొనియాడారు.



అదే విధంగా ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్న ప్రతి మహిళ కాంగ్రెస్ కార్యకర్తలకు అభినందనలు తెలిపారు. అనంతరం జిల్లా మహిళా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య మాట్లాడుతూ తెలుగు సంస్కృతిలో గోరింటాకు పండుగ ప్రత్యేకమైన అందమైన ఆచారం అని, ముఖ్యంగా ఆషాఢమాసంలో మహిళలు చేతులకు, కాళ్ళకు గోరింటాకు పెట్టుకోవడం ఆనవాయితీగా వస్తున్నదని, ఇది కేవలం అలంకారమే కాకుండా ఆరోగ్యం, సాంప్రదాయానికి ప్రతీక అని, గోరింటాకు పండుగ మన బాంధవ్యాలను కలుపుతు అని అన్నారు. ఈ కార్యక్రమంలో వైరా నియోజకవర్గ శాసన సభసభ్యులు మాలోత్ రాందాస్ నాయక్ సతీమణి లలిత, సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ సతీమణి ఇందుమతి, మాజీ మేయర్ పునుకొల్లు నీరజ, మాజీ కార్పొరేటర్లు మిక్కిలినేని మంజుల, పాకాలపాటి విజయ, కన్నం వైష్ణవి, రుద్రగాని శ్రీదేవి, కరుణ, గజ్జల లక్ష్మీ, దామా స్వరూప, మందపల్లి నాగమణి, ఊరుకొండ చంద్రిక, కొత్తపల్లి పుష్ప, బలుసు లక్ష్మీ, రేఖా భార్గవి, మంగ, సుగుణ తదితరులు పాల్గొన్నారు.

# బయ్యారంలో సీపీఎం జైల్ భరో ఉద్రిక్తత

**పలువురు నాయకుల అరెస్ట్**

**బయ్యారం, ప్రభాతవార్త, ఆగస్టు 10:**




కేంద్ర ప్రభుత్వం కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తోందని ఆరోపిస్తూ సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం బయ్యారం మండల కేంద్రంలో జైల్ భరో కార్యక్రమాన్ని నిర్వహించారు. సిఐటియు అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, సిపిఎం శ్రేణులు స్థానిక వెజెళ్ళ సైదులు రావు భవనం నుండి భారీ ప్రదర్శనగా బయలుదేరి బస్ స్టాండ్ సెంటర్ కు చేరుకొని రాస్తారోకో నిర్వహించారు. ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ నిర్వహించిన జైల్ భరో కార్యక్రమం మండలంలో తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. వివిధ డిమాండ్ల పరిష్కారం కోసం నాయకులు, కార్యకర్తలు చేపట్టిన నిరసనను పోలీసులు అడ్డుకున్నారు. అనుమతి లేదంటూ ఆందోళనకారులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ తీరుపై సీపీఎం నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కుంట ఉపేందర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మండా రాజన్న, మండల కార్యదర్శి వల్లాల వెంకన్న, సిఐటియు మండల కో కన్వీనర్ అంగిరేకుల నాగేశ్వరరావు వివిధ సంఘాల నాయకులు చంటి, ఆనందరావు, మోహన్, పురుషోత్తం, మల్లికాంబ, చంద్రకళ, కుంతల, లలిత, రేణుక, దేవదానం, భిక్షం, శ్రీను, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ ఎలక్ట్రీషియన్, వైండర్స్ యూనియన్ ఎన్నిక ఏకగ్రీవం

**మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 10, ప్రభాతవార్త:**

మహబూబాబాద్ పట్టణ ప్రైవేట్ ఎలక్ట్రీషియన్, వైండర్స్ యూనియన్ నూతన కమిటీని రాష్ట్ర అధ్యక్షులు జడల అంజయ్య ఆధ్వర్యంలో సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం జిల్లా అధ్యక్షునిగా నీరుటి వెంకన్న, కోశాధికారిగా తుమ్మలపల్లి వెంకటచారి, ప్రధాన కార్యదర్శిగా పిట్టల వేణు, కార్యదర్శిగా కేసోజు సంతోష్, గౌరవ అధ్యక్షులుగా దావూద్, గౌను యాకన్న, ఈశ్వరచారి, ఉపాధ్యక్షులుగా పూర్ణచారి, దాసరి శ్రీను, శశి, వర్కింగ్ ప్రెసిడెంట్‌లుగా లచ్చిరాం, చిత్తలూరు ఉపేందర్, ముఖ్య సలహాదారులుగా వీరమల్ల లక్ష్మణ్, నూకల ఐలయ్య, సహాయ కార్యదర్శులుగా బండియాల రవి, పాల్, వేముల శ్రీను, దస్తగిరి, హలీం, మున్నా, ఇమామ్, ప్రచార కార్యదర్శులుగా వెంకన్న, దేవేందర్, నవాజ్, ముస్తఫా, శ్రీకాంత్, వెంకన్న తదితరులు ఎన్నికైయ్యారు. అనంతరం ఇటీవల అవార్డు తీసుకున్న ప్రకాష్ ఎలక్ట్రికల్ అధినేత వీరన్నను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాజు, సందీప్, రాము తదితరులు పాల్గొన్నారు.






# ఎల్హెచ్పీఎస్ జిల్లా అధ్యక్షుడిగా భూక్యా మంగీలాల్ నాయక్

## లంబాడి, గిరిజన హక్కుల పరిరక్షణకు కృషి చేస్తా

కొత్తగూడెం టౌన్, ఆగస్టు 10 ప్రభాతవార్త:



నంగారా భేరి లంబాడి హక్కుల పోరాట సమితి (ఎల్హెచ్పీఎస్) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడిగా భూక్యా మంగీలాల్ నాయక్ నియమితులయ్యారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఎల్హెచ్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్ నాయక్ బాణోత్, సంస్థ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు డాక్టర్ బెల్లయ్య నాయక్, రాష్ట్ర అధ్యక్షులు మూడావత్ రాంబాల్ నాయక్ ఆదేశాల మేరకు మంగీలాల్ నాయక్‌కు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా మంగీలాల్ నాయక్ మాట్లాడుతూ లంబాడి, గిరిజనుల సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడుతానన్నారు. గిరిజనుల అభివృద్ధికి కృషి చేస్తూ, గిరిజన చట్టాల పరిరక్షణ కోసం రాజీలేని ఉద్యమాలు చేపడతానని తెలిపారు. లంబాడీలను రాజకీయంగా చైతన్యవంతులను చేసేందుకు కృషి చేస్తానన్నారు. తనకు జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించిన ఎల్హెచ్పీఎస్ జాతీయ, రాష్ట్ర నాయకత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మంచుపల్లి సర్పంచ్ వీరన్న నాయక్, కొత్తగూడెం వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భూక్య జనార్ధన్ నాయక్, మాజీ సర్పంచులు కున్‌సోతు రాంచందర్ నాయక్, బానోత్ గోవింద, న్యాయవాది ధరావత్ రాధాకృష్ణ, ఎల్హెచ్పీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గుగులోతు మోహన్ నాయక్, మంగతు సేవాలాల్, జిల్లా ఉపాధ్యక్షులు గుగులోతు రాందాస్ నాయక్, బానోత్ నరేష్ నాయక్, రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ఆపదలో అండగా నిలిచిన జీఎస్ఆర్ ట్రస్ట్

## గడల జనసేన సోషల్ మీడియా నాయకుడు తులసీరామ్ కృతజ్ఞతలు

కొత్తగూడెం టౌన్, ఆగస్టు 10 ప్రభాతవార్త:



ప్రమాదం లో గాయపడిన తన తండ్రికి సకాలంలో వైద్య సహాయం అందించే దుకు చొరవ చూపిన జనసేన రాష్ట్ర నాయ కులు, తెలంగాణ మాజీ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ గడల శ్రీనివాసరావుకు జనసేన సోషల్ మీడియా కొత్తగూడెం నాయకుడు చింతల తులసీరామ్ అలియాస్ పండు కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం సాయంత్రం తన తండ్రి చింతల అనిల్ కుమార్ రాపిడో వాహనంపై కొత్తగూడెం హెడ్ ఆఫీస్ నుంచి రామవరం వెళ్తుండగా మార్గమధ్యంలో ప్రమాదానికి గురయ్యారని తెలిపారు. ఈ విషయాన్ని ఫోన్ ద్వారా డాక్టర్ గడల శ్రీనివాసరావుకు తెలియజేయగా, ఆయన వెంటనే స్పందించి జీఎస్ఆర్ ట్రస్ట్ మేనేజర్ అంజికి సమాచారం అందించారని పేర్కొన్నారు. దీంతో అంజి వెంటనే కొత్తగూడెం ఏరియా ఆసుపత్రికి చేరుకుని, అక్కడి నుంచి అనిల్ కుమార్‌ను మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెంలోని శ్రీ శ్రీ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందించేందుకు సహకరించారని తెలిపారు. ఈ సందర్భంగా అంజితో పాటు కాశీ, మోదుగు జోగారావులకు కూడా తులసీరామ్ ధన్యవాదాలు తెలిపారు. ఆపద సమయంలో ఒక్క ఫోన్ కాల్‌కు స్పందించి అండగా నిలిచిన డాక్టర్ గడల శ్రీనివాసరావు, జీఎస్ఆర్ ట్రస్ట్ కుటుంబ సభ్యులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు తులసీరామ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# కేంద్రం తీరు మార్చుకోని పక్షంలో ప్రజాగ్రహానికి గురికాక తప్పదు

## కొత్తగూడెం నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం సహకరించాలి

## క్రమబద్ధీకరణ జీవో 76ను బుట్టదాఖలు చేస్తే ఊరుకోం

## సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కే సాబీర్ పాషా

రుద్రంపూర్, ఆగస్టు 10 ప్రభాతవార్త:



కుంటుపడిన కొత్తగూడెం ప్రాంత అభివృద్ధిని గాడిలో పెట్టింది ఒక్క సిపిఐ మాత్రమేనని, నియోజకవర్గ అభివృద్ధికోసం స్థానిక ఎమ్మెల్యే కూనంనేని చేస్తున్న కృషికి ప్రభుత్వం సహకరించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కే సాబీర్ పాషా స్పష్టం చేశారు. సిపిఐ జాతీయ సమితి పిలుపుమేరకు చేపట్టిన ప్రజా చైతన్య యాత్ర ఐదో రోజైన సోమవారం కొత్తగూడెం పట్టణం, చుంచుపల్లి కార్మికప్రాంతాల్లో కొనసాగింది. ఆటాపాటలతో అత్యంత ఉత్సాహంగా సాగిన ఈ యాత్రలో భాగంగా రైల్వే స్టేషన్ సెంటర్, ఎంజి రోడ్డు, సూర్య పాలస్ రోడ్, సింగరేణి హెడ్డాఫీస్, ఎస్‌బి నగర్, రామవరం, 3 ఇంక్లైన్, 4 ఇంక్లైన్, రుద్రంపూర్, గౌతంపూర్, పెనగడప సెంటర్లలో జరిగిన సభల్లో యాత్ర రథసారథి, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కే సాబీర్ పాషా ప్రసంగించారు. ప్రభుత్వం జారీ చేసిన క్రమబద్ధీకరణ జీవో 76ను బుట్టదాఖలు చేస్తే ఊరుకునేది లేదని, పట్టాల జారీ ప్రక్రియ ఏమైందో పాలకులు సమాధానం చెప్పాలని నిలదీశారు. దశాబ్దాలుగా నివాసముంటున్న రామవరం, సింగరేణి ప్రాంత ప్రజలకు తక్షణమే పొజిషన్ సర్టిఫికెట్లు జారీ యాజమాన్యపు హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. సీఎస్ఆర్ నిధులతో సింగరేణి ప్రాంతాలను సమగ్రంగా అభివృద్ధి చేయాలని, కార్మికులకు ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. సింగరేణి సంస్థ అభివృద్ధికి అహర్నిశలు శ్రమించిన మాజీ కార్మికులు, కాంట్రాక్టు కార్మికులు, సంస్థపై పరోక్షంగా ఆధారపడిన కుటుంబాలు నివసిస్తున్న ఇండ్లను యాజమాన్యం కూల్చివేసి నిర్వాసితులను చేసే కుట్రలు చేస్తోందని, ఈ విధానం మార్చుకోవాలని హెచ్చరించారు. చైతన్య యాత్రలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, కల్లూరి వెంకటేశ్వరరావు, మేయర్ మూడ్ గణేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు సరెడ్డి పుల్లారెడ్డి, మున్నా లక్ష్మి కుమారి, చంద్రగిరి శ్రీనివాసరావు, కంచర్ల జమలయ్య, వీసంశెట్టి పూర్ణచంద్రరావు ఉప్పుశెట్టి రాహుల్, కందుల భాస్కర్, జి వీరస్వామి, వాసిరెడ్డి మురళి, ఎస్ కే ఫహీం, ప్రజాసంఘాల నాయకులు భూక్యా శ్రీనివాస్, వరక అజిత్, ప్రజాప్రతినిధులు బోయిన విజయ్ కుమార్, బండి నర్సింహా, దుర్గయ్య, సుధాకర్, మునిగడప పద్మ, శంకర్, నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు, ధనలక్ష్మి, యూసుఫ్, ఖయామ్, గోపి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# బీసీ సంఘం ఆధ్వర్యంలో ఘన నివాళి

కొత్తగూడెం టౌన్, ఆగస్టు 10 ప్రభాతవార్త:

బీసి అభ్యున్నత కోసం నిరంతరం కృషిచేసిన జాతీయ నాయకుడు, న్యాయ కోవిదుడు దివంగత పుంజాల జయశంకర్ జయంతిని మున్నూరు కాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కొత్తగూడెంలోని ఆ సంఘం భవన కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. కేంద్ర మంత్రిగా, న్యాయవాదిగా, బీసీ ఉద్యమకారుడిగా దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఆయన ఆశయ సాధన కోసం బీసీలంతా ఐక్యంగా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం కార్పొరేటర్ రావి రాంబాబు, భీమా శ్రీవల్లి శ్రీధర్, సంఘం బాధ్యులు లింగాల గోపాలకృష్ణ, బండారి రుక్మాంగాధర్, బండి విజయభాస్కర్, జోగం తారక్, కందుకూరి గణేష్, శేఖర్, సత్యనారాయణ అశోక్ తదితరులు పాల్గొన్నారు







# ఏఐటీయూసి ఏరియా బ్రాంచ్ సెక్రటరీగా గట్టయ్య

రుద్రంపూర్, ఆగస్టు 10 ప్రభాతవార్త:

సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసి) కొత్తగూడెం ఏరియా బ్రాంచ్ సెక్రటరీగా జె గట్టయ్య ఎన్నిక అయ్యారు. ఆర్సీ హెచ్‌పీ కార్మికులు సోమవారం ఘనంగా సన్మానం చేశారు. కార్మికులు ఆయనను శాలువాతో సత్కరించి, పూలమాలలు వేసి శుభాకాంక్షలు తెలిపారు. గట్టయ్య నాయకత్వంలో కార్మిక సమస్యలు పరిష్కారం అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గట్టయ్య మాట్లాడుతూ... కార్మికుల పక్షాన పోరాడుతా అని హామీ ఇచ్చారు. కార్మికులు తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయనని అన్నారు. ఆర్సీ హెచ్‌పీ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ ముందుంటానని స్పష్టం చేశారు. యూనియన్ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ ముఖ్య నాయకులు, ఆర్సీ హెచ్‌పీ విభాగానికి చెందిన ఫోర్మన్ వంశీ, సిటిపి సురేందర్, కార్మికులు బంగారి రాజు, భిక్షపతి, సురేందర్, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అంబసత్రం సాగుదారులకు పట్టాలివ్వాలి

## సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కే. సాబీర్ పాషా

లక్ష్మీదేవిపల్లి, ఆగస్టు 10 ప్రభాతవార్త:



దశాబ్దాలుగా అంబసత్రం భూములను సాగు చేసుకుంటున్న పేద రైతులకు హక్కు పత్రాలు ఇవ్వకుండా ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేయడం తగదని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కే. సాబీర్ పాషా అన్నారు. సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజా చైతన్య యాత్ర ఐదో రోజు లక్ష్మీదేవిపల్లి మండలంలో కొనసాగగా, పలు గ్రామాల్లో ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 264 సర్వే నంబర్‌లోని సుమారు 5 వేల ఎకరాల అంబసత్రం భూములను గిరిజన, గిరిజనేతర పేదలు ఏళ్లుగా సాగు చేస్తున్నారని తెలిపారు. రైతు భరోసా నిలిపివేయడంతో పాటు బ్యాంకులు పంట రుణాలు ఇవ్వకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే సాగుదారులకు పట్టాలు ఇచ్చి రైతు భరోసా, పంట రుణాలు అందించాలని డిమాండ్ చేశారు. అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, సంక్షేమ పథకాలు మంజూరు చేయాలని, సీతారామ ఎత్తిపోతల జలాలను లక్ష్మీదేవిపల్లి మండల రైతాంగానికి అందించాలని కోరారు. కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తున్న బీజేపీ విధానాలను మార్చే వరకు ప్రజా పోరాటాలు కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర, జిల్లా నాయకులు, ప్రజాసంఘాల బాధ్యులు, సర్పంచులు, ఉపసర్పంచులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక రైతు సంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో "జైలు భరో"

**మధిర ఆగస్టు 10 ప్రభాతవార్త**

సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో కార్మిక రైతు సంఘాల జైలు భరో కార్యక్రమంలో భాగంగా సోమవారం పట్టణంలో ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. సిఐటియు వ్యవసాయ కార్మిక సంఘం రైతు సంఘం నాయకులు స్థానిక ఎండిఓ కార్యాలయం ఎదుట సమావేశం నిర్వహించి పెద్ద సంఖ్యలో హమాలి వర్కర్లు ఆశ వర్కర్లు మధ్యాహ్న భోజన వర్కర్లు అంగన్వాడి టీచర్ వర్కర్లు ఆర్డబ్ల్యూఎస్ వర్కర్లు ఇంకా ఇతర స్కీం వర్కర్లు, వ్యవసాయ కార్మికులు రైతులు పాల్గొని తమ డిమాండ్ల సాధన కోసం నినాదాలు చేశారు. అనంతరం పట్టణంలోని భగత్ సింగ్ సెంటర్లో ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. సిఐటియు వ్యవసాయ కార్మిక సంఘం రైతు సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన జైలు బరో కార్యక్రమంలో సిపిఎం డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు నాయకులు శీలం నరసింహారావు మందా సైదులు పాపినేని రామ నరసయ్య పడకంటి మురళి



ఇతర నాయకులు పాల్గొని అరెస్టు కావడం జరిగింది. ఈ సందర్భంగా పార్టీ డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక రైతు వ్యతిరేక వ్యవసాయ కార్మికులకు వ్యతిరేక చట్టాలను చేస్తూ సాధారణ ప్రజలను మరింత పేదలుగా మార్చే కుట్ర చేస్తుందని వారి హక్కులను కాల రాస్తుందని దీనికి నిరసనగా దేశవ్యాప్తంగా ఈరోజు ప్రజాసంఘాలుదేశవ్యాప్తంగా ఈరోజు ప్రజాసంఘాలు ఇచ్చినపిలుపులోభాగంగా పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. రానున్నరానున్న కాలంలో ప్రజలసమస్యల పరిష్కారంకోసం మరిన్ని రానున్న కాలంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం మరిన్ని పోరాటాలకు ప్రజలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. పోలీసుల అరెస్టులతో ప్రజా ఉద్యమాలను ఆపలేరని తెలియజేశారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు శీలం నరసింహారావు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మంద సైదులు వ్యవసాయ కార్మిక సంఘం డివిజన్ కార్యదర్శి పాపినేని రామ నరసయ్య సిఐటియు పట్టణ కన్వీనర్ పడకంటి మురళి రైతు సంఘం మండల కార్యదర్శి మందడపు ఉపేంద్ర రావు వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు అంగడాల అమరయ్య షేక్ ఉద్దండు సాహెబ్ నాయకులు తేలపోలు రాధాకృష్ణ ఒట్ల శంకర్రావులను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్కు తరలించారు. వివిధ ప్రజాసంఘాల నాయకులను కార్యకర్తలను ఈ సందర్భంగా పోలీసులు అరెస్టు చేసి స్టేషన్కు తరలించారు




## ఎమ్మెల్యే పాయం ను కలిసిన ఆసుపత్రి సూపరింటెండెంట్ రామ కృష్ణ

**మణుగూరు, ప్రభాతవార్త, ఆగస్టు10:**



మణుగూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి నూతన న రా వ రి ం టె ం డె ం ట్ గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ ఎం. రామకృష్ణ సోమవారం పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఆసుపత్రికి వచ్చే పేద ప్రజలకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు వైద్యులు, సిబ్బంది సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి ఆర్ఎంవో డాక్టర్ బి. విశ్వ నిఖిల్, అనస్థీషియాలజిస్ట్ డాక్టర్ మోహన్ వంశీ తదితరులు పాల్గొన్నారు

## మండల కమిటీలు 15వరకు పూర్తి చేయాలి

### కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు తూములూరి

**కూసుమంచి, ఆగష్టు 10 (ప్రభాతవార్త ) :**

కాంగ్రెస్ పార్టీ మండల కమిటీలు ఆగష్టు15 లోపు పూర్తి చేయాలని జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు తూములూరి నరసింహారావు తెలిపారు. సోమవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో క్యాంపు కార్యాలయ ఇంచార్జ భీమిరెడ్డి.శ్రీనివాస రెడ్డి ని, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బజ్జూరి.వెంకటరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ ఆదేశాల మేరకు కేటాయించిన రిజర్వేషన్ల తో పాటు 30 శాతం మహిళా కోటాను ఉపయోగించి 21 మంది సభ్యులతో మండల



కమిటీ పూర్తి చేసి ఆగష్టు 15 వరకు పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లాపార్టీ ఉపాధ్యక్షుడు మంకేన వాసు, ప్రధాన కార్యదర్శి ఎండి.హఫీజుద్దీన్,కార్యదర్శి గొల్లపూడి వీరన్న, తదితరులు పాల్గొన్నారు.

## ఏన్కూరులో హోరెత్తిన" జైల్ భరో

**.ఏన్కూరు,ఆగస్టు 10, ప్రభాతవార్త**

:కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్పొరేట్ అనుకూల..ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీఐటీ యు..రైతు..వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మండల కేంద్రమైన ఏన్కూరులో నిర్వహించిన "జైల్ భరో " నిరసన కార్యక్రమం విజయవంతమైంది.రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ..దేశ వ్యాప్త పిలుపులో భాగంగా.. నిరసన కార్యక్రమం చేపట్టారు.మండల తహసిల్దార్ కార్యాలయం నుంచి ప్రారంభమై..ప్రధాన రహదారిపై నడుచు కుంటూ పాత చెక్ పోస్ట్ వరకు నాయకులు..కార్యకర్తలు భారీగా ర్యాలీ నిర్వహించి..ప్రధాన సెంటర్ లో రాస్తా రోకో చేపట్టారు.అనంతరం నాయకులు స్వచ్ఛందంగా పోలీస్ స్టేషన్లో అరెస్ట్ అయ్యారు.ఈ సందర్భంగా సీపీయం మం డల కార్యదర్శి దొంతబోయిన నాగేశ్వరరావు మాట్లాడుతూ..కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని..ఉపాధి హామీ చట్టాన్ని యథాతథంగా కొనసాగించాలని..స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అ మలు చేయడంతో పాటు ఎరువుల యాప్ ను ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.మోడీ సర్కార్ నిరంకుశ విధానాలను అమలు చేస్తుందని ఆయన ఆరోపించారు.కేంద్ర ప్రభుత్వ చట్టాలు కార్పొరేట్ శక్తులకు మేలు కలిగేలా ఉన్నాయని..వాటిని వెంటనే ఉపసంహరించుకోవాలని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.కేంద్ర ప్రభుత్వం వ్యతిరేక విధానాలతో దేశంలో ఉన్న అన్ని వర్గాల ప్రజలకు ఇబ్బందులు..ఆ రోజుల్లో బ్రిటిష్ ప్రభుత్వమును క్విట్ ఇండియా ఉద్యమంతో దేశం నుండి తరిమివేసాము..పార్టీలకు అతీతంగా బీజేపీ ప్రభుత్వంపై ఉద్యమం చేద్దాం.. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వంను గద్దె దించుదాంమన్నారు.అదే విధంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ.. కార్పొరేట్ శక్తులకు లాభాలు చేకూర్చేందుకు దశాబ్దాలుగా పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో 4 లేబర్ కోడ్లను తీసుకురావడాన్ని ఖండించారు.రోజువారీ పనివేళలను పెంచడం..సమ్మె హక్కు ను కాలరాయడం..300 మంది లోపు ఉద్యోగులు ఉన్న సంస్థల్లో హైర్ అండ్ ఫైర్ విధానాన్ని తేవడం వల్ల కార్మి కు ల ఉద్యోగ భద్రత ప్రశ్నార్థకంగా మారిందన్నారు.అలాగే విదేశాలతో చేసుకుంటున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల వ ల్ల సుంకాలు లేకుండా దిగుమతులు పెరిగిపోవడంతో దే శీయ రైతులు దివాళా తీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశా రు.ఉపాధి హామీ పథకంలో రాష్ట్రాల వాటాను పెంచడం.. ఆహార భద్రత బియ్యం కోత విధింపుల నిర్ణయాలను వె నక్కి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.అలాగే 2025 విద్యుత్ సవరణ బిల్లు..రైతు డిస్కమ్ల ఏర్పాటు ద్వారా వ్యవ సాయ మోటార్లకు మీటర్లు బిగించి..విద్యుత్ రంగాన్ని ప్రైవే టీకరించేందుకు కుట్ర పన్నుతున్నారని నాయకులు ఆ రోపించారు.ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ప్రజా వ్యతిరేక విధానాలను మానకపోతే భవిష్యత్తులో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ నిరసన కార్యక్రమంలో ఖమ్మం జిల్లా గిరిజన సంఘం నాయకులు బానోత్ బాలాజీ,సీఐటీయు కార్యదర్శి ఏర్పుల రాములు, వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి ఇటికాల లెనిన్, మాజీ ఎంపీటీసీ భూక్యా లక్ష్మా,ఎస్.కే జానీ,కాలసాని సాయి,కూరపాటి నరసింహారావు,నామా కృష్ణయ్య,తమ్మినేని వెంకటయ్య,కట్రం గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

# వీబీజీ రామ్ జీ అమలులో ఏఐ. కృత్రిమ మేధ వినియోగం.

**అక్రమాలకు అడ్డుకట్ట వేసే దిశగా కేంద్రం అడుగులు.**

**డ్రోన్లు..శాటిలైట్ చిత్రాలతో పనులపై నిఘా.**

**నకిలీ మస్టర్లు..తప్పుడు కొలతలకు చెక్**

**ఏన్కూరు,ఆగస్టు10, ప్రభాతవార్త :**

వికసిత్ భారత్..గ్యారంటీ ఫర్ రోజ్ గార్ అజీవికా మిషన్ గ్రామీణ్(వీబీజీ రామ్ జీ )అమలులో కృత్రిమ మేధ (ఏ ఐ) ను వినియోగించే దిశగా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది.ఈ పథకం కింద జరుగుతున్న అభివృద్ధి పనులు.. లబ్ధిదారుల హాజరు..నిధుల వినియోగం వంటి అంశాలను..ఏఐ ఆధారంగా పర్యవేక్షించే విధానాన్ని అమలు చే యాలని అధికారులు భావిస్తున్నారు.శాటిలైట్ చిత్రాలు..డ్రోన్ సర్వేల ఆధారంగా పనుల ప్రామాణికత నిర్ధారించను న్నారు.దీంతో ఈ పథకం అమలు మరింత పారదర్శకంగా మారనుంది.కొత్త విధానంలో ఇస్రో భువన్ పోర్టల్ కు చెం దిన శాటిలైట్ చిత్రాలను విస్తృతంగా వినియోగించుకోనున్నారు. అధికారులు కార్యాలయాలలో తప్పుడు కొలతలు నమోదు చేసే అంశాలను పూర్తిగా నిరోధించేలా వ్యవస్థను రూపొందించారు.శాటిలైట్..డ్రోన్ ద్వారా నమోదైన కొల తలు..ఎంబుక్ లో వివరాలు సరిపోలకుంటే వెంటనే విచారణ చేపట్టనున్నారు.అక్రమాలు నిర్ధారణ అయితే



సంబం ధిత అధికారుల ఐడీలను నిలిపి వేయడంతో పాటు రికవరీ చర్యలు చేపడతారు.ఫోటో మారకపోతే చెల్లింపు నిలిపివేత.గ్రామీణ ప్రాంతాలలో కొందరు కూలీలు..మేట్లు కలిసి చేస్తున్న మోసాలకు కూడా కొత్త విధానంతో అడ్డుకట్ట పడనుం ది.ఉదయం..మధ్యాహ్నం హాజరు తీసుకుని మధ్యలో పనిచేయకుండా వెళ్లే ఘటనలు ఏఐ సులభముగా గుర్తించ నుంది.ఉదయం తీసిన ఫోటో..మధ్యాహ్నం తీసిన ఫోటోలను క్లౌడ్ సర్వర్ ఏఐ సాఫ్ట్వేర్ క్షణాలలో విశ్లేషిస్తుంది.రెం డు ఫోటోలు మధ్య ఎలాంటి పురోగతి లేకపోతే ఆరోజు పని జరగలేదని స్వయంగా గుర్తిస్తుంది.అలాంటి మస్టర్లను ఆటోమేటిక్ గా తిరస్కరించి చెల్లింపులు నిలిపివేస్తుంది.ఫోటో మొబైల్ స్క్రీన్ పై చూపించి మళ్లీ చిత్రీకరించే మోసా లను కూడా ఏఐ కనిపెడుతుంది.100 నుంచి 125 రోజులు..కొత్త విధానంలో నిజాయితీగా పనిచేసే కూలీలకు ప్రత్యేక ప్రయోజనాలు అందనున్నాయి.ఇప్పటివరకు ఉన్న 100 రోజుల ఉపాధిని 125 రోజులకు పెంచే నిర్ణయం తీసుకున్నారు.కనీస వేతనాన్ని రూ. 308గా నిర్ణయించడంతో కూ లీల ఆదాయం మరింత పెరగనుంది.అక్రమాలకు అవకాశం లేకుండా డిజిటల్ పర్యవేక్షణ కొనసాగ నుండడంతో అ ర్హులైన కూలీలే ప్రయోజనాలు పొందనున్నారు.ఏఐతో నకిలీ మస్టర్లకు పూర్తిగా చెక్ పడనుంది.సాంకేతికతతో ఉ పాధి హామీ పథకం మరింత సమర్థవంతంగా..పారిదర్శకంగా అమలవుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

**కఠిన చర్యలు తప్పవు.**

ఇప్పటివరకు ఏఐ ఆధారిత హాజరు కేవలం నిబంధనగానే ఉండేది. ప్రస్తుతం దానికి చట్ట బద్ధత గుర్తింపు కల్పించ డం వల్ల అధికారుల బాధ్యత మరింత పెరగనుంది.డిజిటల్ కొలతలకు భిన్నంగా ఎంబుక్ నమోదు చేసిన అధికా రులపై నేరుగా విచారణ చేపట్టే వెసులు బాటు కల్పించారు.సాంకేతిక ఆధారాలతో విస్మరించి తప్పుడు నివేదికలు సమర్పిస్తే కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరిస్తున్నారు.ప్రభుత్వం నిధుల దుర్వినియోగానికి అడ్డుకట్ట ప డనుందని అంచనా వేస్తున్నారు.

## కామేపల్లి లో ఘనంగా గొట్టుపర్తి శివాజీ జన్మదిన వేడుకలు

అయ్యప్ప సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో సన్మానం శుభాకాంక్షలు తెలిపి న భక్తులు, గ్రామస్తులు

**కామేపల్లి, ఆగస్టు 10 ప్రభాతవార్త:**

మండల కేంద్రమైన కామేపల్లి లో అవధూతేంద్ర భక్తమండలి అధ్యక్షులు గొట్టుపర్తి శివాజీ 62వ, జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా అయ్యప్ప సేవ ట్రస్ట్ ఆధ్వర్యంలో శివాజీకి మొండ్రు పుల్లయ్య గురు స్వామి,ఆరుద్ర బ్రహ్మం,అ జ్మీర బిక్షం శాలువా కప్పి సత్కరించారు.పుష్పగు చ్ఛం అందించి శుభాకాంక్ష లు తెలిపారు.అందరికీ ఆదర్శవంతంగా, స్ఫూర్తిదాయకంగా ఆధ్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తుండటం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ఆధ్యాత్మిక గురువు శివాజీని ఘనంగా వారు సన్మానించడం జరిగింది. అదే విధంగా భక్తులు, గ్రామస్తులు, మండల, జిల్లా వాసులు, అధికారులు, ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు కూడా శివాజీకి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపి వారి త్యాగ, సేవా నిరతిని ప్రశంసించారు.

వార్త



# జైల్ భరోతో దద్దరిల్లిన భద్రాచలం



-కార్మిక, కర్షక హక్కుల కోసం భారీ రాస్తారోకో

-ఐదు కి.మీ. మేర స్తంభించిన రాకపోకలు.. కార్యకర్తల అరెస్టు



**భద్రాచలం,ఆగస్టు 10 (ప్రభాతవార్త):**

కార్మిక, కర్షక హక్కుల పరిరక్షణ కోసం సీఐటీయూ, ఏఐకేఎస్,ఏఐఏడబ్ల్యూయూ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన జైల్‌భరో కార్యక్రమం ఉద్రిక్తంగా సాగింది. పట్టణంలోని బ్రిడ్జి సెంటర్‌లో భారీ రాస్తారోకో నిర్వహించ చడంతో వాహనాల రాకపోకలు స్తంభించాయి. సుమారు ఐదు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు పెద్ద సంఖ్యలో పాల్గొని కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ నిలిపివేయాలని, స్కీం వర్కర్లను పర్మినెంట్ చేయాలని, పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. రాస్తారోకోతో ట్రాఫిక్‌కు అంతరాయం కలగడంతో పోలీసులు ఆందోళనకారులను అరెస్టు చేసేందుకు ప్రయత్నించగా కార్యకర్తలతో తోపులాట జరిగింది. అనంతరం పలువురు నాయకులు, కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. అరెస్టులను నిరసిస్తూ కార్యకర్తలు పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని జైల్‌భరో నిర్వహించారు. హక్కులపై దాడిని సహించం సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏజే రమేష్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తూ కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తోం దని విమర్శించారు. పోరాటాలతో సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసే ప్రయత్నాలను అడ్డు కుంటామని అన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని, లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా వ్యతిరేక విధానాలను కేంద్రం ఉపసం హరించుకునే వరకు ఉద్యమా లను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎం.బి. నర్సారెడ్డి, గడ్డం స్వామి, ఎర్రంశెట్టి వెంకట రామారావు, కొలగాని రమేష్, జీవనజ్యోతి, సున్నం గంగా, కుంజ శ్రీనివాస్, సతీష్‌బాబు, రవీంద్ర పాల్గొన్నారు.

# సీతారామా అనుమతులపై మళ్ళీ.. ఆంధ్రా అభ్యంతరాలు

**సమ్మక్క బ్యారేజ్‌ని పూర్తిగా ఆపాలని డిమాండ్**

**ఈ వ్యూహాత్మక దూకుడులోని ఆంతర్యమేమి**

**ఐదు ప్రాజెక్ట్‌ల అప్రూవల్స్ తిరిగి పరిశీలించాలట**

**వీటికి ఎప్పుడో సిడబ్ల్యుసి అమోదం లభించింది**

**జలవనరుల సంఘ ఆర్డర్లపై రివ్యూ చేసే అధికారం ఉన్నదా**

**ఈనెల 18న హైద్రాబాద్‌లో జిఆర్ఎంబి ప్రత్యేక సమావేశం**

**రాష్ట్ర ప్రభుత్వం బహిష్కరించాలని బిఆర్ఎస్ డిమాండ్**



**అశ్వారావుపేట/ప్రభాతవార్త**

కేంద్ర జలవనరుల సంఘం ఇదివరకెప్పుడో తెలంగాణా భూభాగంలో అనుమతులిచ్చిన ఐదు నీటిపారుదల ప్రాజెక్ట్‌ల విషయంలో ఆంధ్రప్రదేశ్ పెడుతున్న తాజా అభ్యంతరాలు విస్మయాన్ని కలిగిస్తున్నాయి. ఈనెల హైద్రాబాద్‌లో గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డ్ నిర్వహిస్తున్న ప్రత్యేక సమావేశంలో ఆ ప్రభుత్వం సమర్పించిన ఎజెండా మన ప్రయోజనాలకు విఘాతం కలిగించేదిగా ఉన్నదని, మాజీ నీటిపారుదల మంత్రి హరీష్‌రావు ఆందోళన వ్యక్తం చేసిన విషయం మనందరికీ తెలిసిందే. ఎపి సర్కార్ తాను సమర్పించిన తాజా పిటిషన్లో., తెలంగాణాలోని కాళేశ్వరం, సీతారామాలిఫ్ట్ ఇరిగేషన్, చాటుపల్లి..హనుమంతరావు ప్రాజెక్ట్, చనక..కోరట మద్దికుంట వాగు, కడెం..గూడెం ప్రాజెక్టుల నిర్మాణానికి ఇప్పటికే ఇవ్వబడిన అనుమతులపై పున్వపరిశీలన జరపాలని కోరుతూ., సమ్మక్క బ్యారేజ్ అనుమతులనయితే పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేయడం ఆశ్యర్యాన్ని కలిగిస్తున్నది. ఎందుకంటే వీటన్నింటికీ ఏనాడో కేంద్ర జలవనరుల సంఘం వారు సమస్త అనుమతులూ ఇచ్చేశారు. ఇప్పుడు కొత్తగా ఆ సర్కార్ కొర్రీలు పెట్టేలా ప్రయత్నించడం సర్వత్రా చర్యనీయాంశమవుతున్నది. రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్నట్లుగా గోదావరి నదిలో తెలంగాణా వాటాకు కేటాయించబడిన 968టిఎంసిఎఫ్‌టి కాకుండా అదనంగా డ్రా చేస్తున్నందున, డౌన్‌స్ట్రీంలోని ఎపికి తీవ్ర నష్టం జరుగుతున్నదని కూడా ఈ సందర్భంగా వారి నోట్స్ లో పొందుపరచడం గమనార్హం. నికర జలాలు..మిగులు జలాల దామాషాలో తాము విభజన చట్టంలో జరిగిన నీటి పంపకాల ఒప్పందాన్ని ఏనాడూ ఉల్లంఘించడం లేదని ఒపక్కన అనేక సందర్భాల్లో తెలంగాణా సర్కార్ గడచిన పదేళ్ళుగా వాదిస్తున్నా పొరుగు ప్రభుత్వం ఇదే పాట పాడుతున్నది. ఈ క్రమంలోనే ఈనెల 18న హైద్రాబాద్‌లో జరగబోయే జిఆర్ఎంబి సమావేశంలో కొత్త అభ్యంతరాలు లేవనెత్తుతూ సరికొత్త అంతర్రాష్ట్ర సమస్యలకు తెరలేపేందుకు రంగం సిద్ధమవుతున్నట్లు.,అందువల్ల కాంగ్రెస్ సర్కార్ ఈ సమావేశాన్ని బహిష్కరించాలని హరీష్‌రావు డిమాండ్ చేయడాన్ని మనం చూశాం. ఐతే తెలంగాణా ప్రభుత్వ ఆరోజున తన వ్యూహాన్ని ఏవిధంగా అమలుచేస్తుందో ఇప్పుడే చెప్పలేం. ఆమాటకొస్తే ఏ ప్రభుత్వమైనా తమకు నష్టం జరిగే పనులకు ఎలా ఒప్పుకుంటుంది. బహుశా వ్యతిరేకించడం తప్ప మరో మార్గం ఉండకపోవచ్చు. ఐతే ఆంధ్రా ప్రభుత్వపు ఈ వ్యూహాత్మక దూకుడు నిర్ణయం వెనుక ఉన్న కారణాలేమిటో తెలియడంలేదని మన ఇరిగేషన్ నిపుణులు కొందరు అభిప్రాయపడుతున్నారు. ఎలాగూ ఒకసారి సిడబ్ల్యుసి ఆమోదం పొందిన సాగునీటి ప్రాజెక్టులపై రివ్యూచేయడానికి జిఆర్ఎంబి వద్ద ఎలాంటి చట్టబద్ధత లేదనే తెలుస్తున్నది.

**జిఆర్ఎంబికి ఆ అధికారం ఉన్నదా**

కేంద్ర జలవనరుల సంఘం వారు ఇచ్చిన సాగునీటి ఆమోదాలపై రివ్యూ చేసే అధికారం గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డ్ కి లేదనే తెలుస్తున్నది. సిడబ్ల్యుసి అనేది కేంద్రజల్‌శక్తి మంత్రిత్వ శాఖకు అనుబంధంగా చట్టబద్ధంగా పనిచేసే టెక్నికల్ అడ్వయిజరీ కమిటి(టిఎసి). జిఆర్ఎంబి కేవలం పైదానికి సబార్డినేట్ రెగ్యులేటరీ బాడీ మాత్రమే. అంతకుమించి ఎలాటి చట్టబద్ధత లేదు. సిడబ్ల్యుసి ద్వారా జారీచేయబడిన అనుమతుల విషయంలో రివ్యూ చేయడమో, లేదా డిజైన్లను మార్పుచేయడమో ఇక్కడ కుదరదు. ఒకసారి ఒక ఇరిగేషన్ ప్రాజెక్ట్‌కి సిడబ్ల్యుసి ఆమోదం తెలిపిందంటే ఇక అదే అంతిమం. ఇలాంటి పరిస్థితుల్లో తిరిగి తెలంగాణా ప్రాజెక్ట్‌ల అనుమతులను పరిశీలించాలని ఎపి ప్రభుత్వం జిఆర్ఎంబిని కోరడం ఏమిటో అంతుపట్టకుండా ఉన్నది. మీటింగ్ జరిగితేనే తప్ప 18 వ తేదీన ఏం జరిగిందో తెలియదు. ఇదిలా ఉంటే సీతారామాలిఫ్ట్ ఇరిగేషన్ కాలువల్లో ప్రస్తుతానికి పారుదల నిలిచిపోయింది. పదిరోజులకు పైగా దుమ్ముగూడెం వద్ద గోదావరి నీటిని మోటార్ల ద్వారా డ్రా చేసి.,ఖమ్మం జిల్లాలోని కొన్ని ప్రాంతాలకు పారించారు. కాగా కొద్దిరోజులుగా ఇది ఆగిపోయింది. రిజర్వాయర్లలో నీరు పూర్తిస్థాయిలో నిల్వ ఉన్న కారణంగా ఆపారా.,లేదా మరేదైనా ఇంకో కారణమున్నదా అనే సందేహాలు ప్రజలకు ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. దారి పొడవునా అనేక చోట్ల ప్రధాన కాలువకు లైనింగ్ చేయలేదని.,అంచులు కోతకు గురవుతాయనే భయంతోనే లిఫ్ట్‌ని ఆపాల్సి వచ్చి ఉంటుందని అంతా భావిస్తుండగా.,అది ఎంతవరకూ వాస్తవమో ఇంజనీర్లు చెప్పాల్సి ఉంటుంది. దీనిపై ప్రభాతవార్త వరుస కథనాలను అందించనున్నది.

# చిరు వ్యాపారులకు రోటరీ 'చిరు' చేయూత

-50 మంది చిరు వ్యాపారులకు గొడుగుల పంపిణీ



**భద్రాచలం,ఆగస్టు 10 (ప్రభాతవార్త):**

రోడ్ల పక్కన చిరు వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్న వారికి భద్రాచలం రోటరీ క్లబ్ అండగా నిలిచింది. ఎండ, వాన నుంచి రక్షణతో పాటు వ్యాపారానికి ఉపయోగపడేలా 50 మంది చిరు వ్యాపారులకు సోమవారం 50 గొడుగులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా రోటరీ క్లబ్ అధ్యక్షులు షేక్ అజీమ్ మాట్లాడుతూ..గత 29 ఏళ్లుగా రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, బడుగు, బలహీన వర్గాలకు నేరుగా ఉపయోగపడే కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. కుట్టు మిషన్లు, తోపుడు బండ్లు తదితర ఉపాధి సాధనాలను అవసరమైన వారికి అందించనున్నట్లు చెప్పారు.సెప్టెంబర్‌లో 120 సైకిళ్ల పంపిణీప్రభుత్వ పాఠశాలల్లో 8 నుంచి 10వ తరగతి చదువుతున్న బాలికలకు సెప్టెంబర్‌లో 120 సైకిళ్ల పంపిణీ చేయనున్నట్లు అజీమ్ తెలిపారు. విద్య, వైద్యం, ఉపాధి, సామాజిక సేవలపై ఏడాది పొడవునా కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రణాళిక రూపొందించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో రోటరీ పూర్వాధ్యక్షులు యశోద రాంబాబు, కటుకూరి ప్రభాకర్ గుప్తా, చలపతి, కొండవీటి సందీప్, కార్యదర్శి పాపినేని రాజేష్, ట్రెజరర్ కొత్త రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# మోడీ తీరు మారకుంటే పతనమే



కార్పొరేట్, సంపన్నుల సేవలో కేంద్ర సర్కార్

అఖిలపక్ష రైతు, కార్మిక సంఘాల నేతలుఖమ్మంలో విజయవంతమైన జైల్ భరో

వందలాది మంది అరెస్టు

**ఖమ్మం బ్యూరో,ప్రభాతవార్త:**

మోడీ తీరు మారకుంటే పతనం తప్పదని అఖిలపక్ష రైతు, కార్మిక సంఘాల నేతలు హెచ్చరించారు. కార్మిక హక్కులను హరించి వేస్తూ లేబర్ కోడ్లను అమల్లోకి తీసుకు వచ్చారని వ్యవసాయ రంగాన్ని మరింత సంక్షోభంలోకి నెట్టి రైతును భూమి నుంచి తరిమేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తుందని ఇందుకు ప్రతిఫలం అనుభవించక తప్పదని నేతలు తెలిపారు. సంయుక్త కిసాన్ మోర్చా సెంట్రల్ ట్రేడ్ యూనియన్స్ పిలుపు మేరకు ఖమ్మంలో సోమవారం జైల్భరో కార్యక్రమాన్ని నిర్వహించారు. అంబేడ్కర్ సెంటర్ నుంచి ఖమ్మం టూటౌన్ పోలీస్ స్టేషన్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. వందలాది మంది రోడ్డుపై బైఠాయించి కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ఆందోళన నిర్వహించారు. పోలీసులు అఖిలపక్ష నేతలను అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ వందల సంఖ్యలో ఆందోళనకారులు తమను కూడా అరెస్టు చేయాలంటూ పోలీస్ స్టేషన్లో చొచ్చుకుని వెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ ఆందోళనకు సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు,



సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర నాయకుడు,మాజీ శాసన సభ్యులు గుమ్మడి నర్సయ్య, మాస్ లైన్ పార్టీ జిల్లా కార్యదర్శి సివై పుల్లయ్య, బిఆర్ ఎస్ జిల్లా నాయకుడు పగడాల నాగరాజు, చంద్రావతి, తెలంగాణ రైతు సంఘం జిల్లా నాయకులు కొండపర్తి గోవిందరావు, దొండపాటి రమేష్, మాదినేని రమేష్, బొంతు రాంబాబు, వి. కోటేశ్వరరావు, వై. ప్రకాష్, బిఆర్ఎస్ నాయకులు పగడాల నాగరాజు, కార్మిక సంఘాల నాయకులు శింగు నర్సిం హారావు, తోట రామాంజ నేయులు, తాటి వెంకటేశ్వరరావు, కళ్యాణం వెంకటేశ్వరరావు, జి. రామయ్య, యర్రా శ్రీనివాస్, మెరుగు సత్యనారాయణ, అశోక్, నరాల నరేష్ నాయుడు, ఎండివై పాషా తదితరులు నేతృత్వం వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జాతీయ సమితి సభ్యులు, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షులు బాగం హేమంతరావు మాట్లాడుతూ మోడీ సర్కార్ సంపన్నుల సేవలోనే ఉందని రైతులు, కార్మికుల పట్ల కక్షపూరిత వైఖరిని అవలంబిస్తుందన్నారు. దేశ సంపదను అంబానీ, అదానీలతో పాటు కార్పొరేట్లకు కట్టబెడుతూ వ్యవసాయ రంగాన్ని కూడా వారి పరం చేసేందుకే నూతన సాగు చట్టాలను తీసుకు వచ్చిందని ఆయన తెలిపారు. చారిత్రిక పోరాట నేపథ్యంలో సాగు చట్టాలను ఉపసంహరించుకున్నట్లు ప్రకటించిన దొడ్డి దారిని వాటిని అమలు చేస్తుందని ఆయన ఆరోపించారు. పంటకు మద్దతు ధరను ప్రకటించడంతో పాటు వాటి అమలుకు మద్దతు ధర గ్యారెంటీ చట్టాన్ని తీసుకు రావాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయని మద్దతు ధర గ్యారెంటీ చట్టాన్ని తీసుకు వచ్చేంత వరకు సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఆందోళనను నిర్వహించి ఈ ప్రభుత్వాన్ని స్తంభింపజేస్తామన్నారు. వ్యవసాయాన్ని లాభసాటిగా చేయడ మంటే కార్పొరేట్లకు కట్టబెట్టడ మేనా అని ఆయన ప్రశ్నించారు. అనేక దశాబ్దాల పాటు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను ఈ ప్రభుత్వం రద్దు చేసిందని ఇందుకు ప్రతిఫలం అనుభవిం చక తప్పదన్నారు. యాజమాన్యాల చేతుల్లో కార్మికులను బానిసలుగా చేసే ప్రయత్నం చేస్తున్నారని దీనిని యావత్ కార్మిక లోకం నిరసిస్తుందన్నారు. 12 ఏళ్లాలంలో మోడీ ఏ ప్రజా అనుకూల నిర్ణయాన్ని చేయలేదని ప్రజలను వంచించే ప్రయత్నంలోనే దశాబ్ద కాలం గడిపారని హేమంతరావు తెలిపారు. ధరల పెరుగుదలను నియంత్రించడంలో సర్కార్ ఘోరంగా విఫలమైందని ఆయన తెలిపారు. సంఘటిత పోరాటాలే మోడీ ప్రభుత్వాన్ని నిలువరిస్తాయ న్నారు. రాముడి పేరుతో ఎంతో కాలం ప్రజలను వంచించలేరని హేమంతరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో మిడికంటి వెంకటరెడ్డి, శంకర య్య, సాంబశివరెడ్డి, వరదా నర్సింహారావు, బండి పద్మ, వై. విక్రం, నవీన్రెడ్డి, శోభ, శిరోమణి తదితరులు పాల్గొన్నారు.

# విమలక్క 50 ఏళ్ల ప్రజా సంస్కృతిక ఉద్యమం

-50 గంటల పాటు ఆట.. పాట.. మాటల ప్రస్థానం

-సెప్టెంబర్ 26న ఉదయం పది గంటల నుంచి ప్రజా కళా జాతర ప్రారంభం -విలేకరుల సమావేశంలో విమలక్క



**ఖమ్మం ఆగస్టు 10, ప్రభాతవార్త:**

అరుణోదయ విమలక్క 50 ఏళ్ల ప్రజా సంస్కృతిక ప్రస్థానాన్ని పురస్కరించుకొని సెప్టెంబర్ 26న ఉదయం పదిగంటల నుంచి సెప్టెంబర్ 28 మధ్యాహ్నం 12: గంటల వరకు ఏకధాటిగా 50గంటల పాటు ఆట..పాట.. మాటలతో ప్రజా కళా జాతర కార్యక్రమం హైదరాబాదులో నిర్వహిస్తున్నట్లు అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు విమలక్క వెల్లడించారు. ఖమ్మం ప్రెస్ క్లబ్‌లో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ. విప్లవోద్యమాల నుండే విప్లవకారులు పుడతారు. ప్రజా ఉద్యమాల నుండి ప్రజా కళాకారులు ఉద్భవిస్తారు. తన జీవితకాలం విప్లవ ప్రజా సంస్కృతిక ఉద్యమాలలో 50 ఏళ్ల మైలురాయిని అధిగమించిన తన ప్రస్థానంలో 50 గంటల పాటు ఏకధాటిగా ఆట,పాట, మాటలతో ప్రజాకళ జాతరను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బహుళ ప్రజా కళలు,జానపద కళారూపాలు,ప్రజా కళా జాతర,మనువాదంగా సంస్కృతి మూడత్వమై, సామ్రాజ్యవాద సంస్కృతి సాగుతున్న దాడికి ప్రత్యామ్నాయ ప్రజా సంస్కృతి నిర్మాణంలో భాగమై సంస్థలను, శక్తులను, వ్యక్తులందరినీ సాదరంగా ఈ కార్యక్రమానికి ఆహ్వానిస్తున్నట్లు ఆమె తెలిపారు. విమలక్క ఒక వ్యక్తి కాదు అని, సామూహిక శక్తి అని 1974 ఆగస్టులో అరుణో దయ సంస్కృతిక సమైక్య ఉస్మానియాలో పురుడు పోసుకునేటప్పటికీ బాల గాయనిగా వెలుగులోకి వచ్చిన విషయం ప్రతి ఒక్కరికి తెలుసునని అన్నారు. అనేక కష్ట నష్టాలను ఎదుర్కొని జైలు జీవితాన్ని అనుభవించి ప్రజా ఉద్యమాలే ఆయుధంగా ఎంచుకొని అరుణోదయ సంస్కృతిక విప్లవంలో పాటల ప్రస్థానం ఒక మరువరాని ఘట్టం అన్నారు. తన జీవితం ప్రజలకు అంకితంగా భావిస్తూ తన స్వభావం కలిగిన కార్యకర్తలను కళాకారులను ప్రేమ పూర్వకంగా 50 గంటల పాటు సాగే ప్రజా కల జాతర నిర్వహణలో స్వచ్ఛందంగా ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని విమలక్క పిలుపునిచ్చారు. ఈ విలేకరుల సమావేశంలో అరుణోదయ సంస్కృతిక సమైక్య రాష్ట్ర అధ్యక్షులు మల్సూర్, ప్రధాన కార్యదర్శి పోతుల రమేష్, ఆంధ్రప్రదేశ్ ప్రధాన కార్యదర్శి సుధాకర్,వర్ష సామాజిక అధ్యయన వేదిక రాష్ట్ర అధ్యక్షులు భాస్కర్, టిపి జెఎసి జిల్లా కన్వీనర్ విజయ్, అరుణోదయ సంస్కృతిక సమైక్య సహకార దర్శి రాకేష్, ఉపాధ్యక్షులు అనిత పాల్గొన్నారు.

# నాడు ఆక్సిజన్ మాస్క్‌తో సందేశం.. నేడు విత్తనాలతో సంకల్పం!



**పుట్టినరోజు వేడుకలను ప్రకృతికి అంకితం చేసిన చిన్నారి నైని**

**తిరుమల కొండలపై విత్తనాలు చల్లుతూ.. వన్యప్రాణులకు రేపటి ఆహారాన్ని సిద్ధం చేస్తూ..**

**'విత్తనం నాటాలి.. మొక్కను పెంచాలి.. పర్యావరణాన్ని కాపాడాలి' అంటూ భావితరాలకు పచ్చని సందేశం**

**కొత్తగూడెం టౌన్, ఆగస్టు 10 ప్రభాతవార్త:**

పుట్టినరోజంటే కేక్.. బెలూన్లు.. బహుమతులు.. సందడి. కానీ ఆ చిన్నారి పుట్టినరోజు మాత్రం ప్రకృతికి పండుగైంది. తన పుట్టినరోజు వేడుకలను భిన్నంగా జరుపుకుంటూ తిరుమల కొండలపై విత్తనాలు చల్లుతూ.. భవిష్యత్తులో పచ్చని చెట్లుగా మారాలని ఆకాంక్షిస్తూ.. పర్యావరణ పరిరక్షణకు అద్భుతమైన సందేశాన్ని ఇచ్చింది కొత్తగూడెంకు చెందిన చిన్నారి నైనిక రజువా... చిన్న వయసులోనే ప్రకృతిపై మమకారం పెంచుకున్న నైనిక.. మొక్కలు నాటడమే కాదు.. విత్తనాలను సేకరించడం, మొక్కలను ఇతరులకు బహుమతిగా ఇవ్వడం, ప్రజల్లో పర్యావరణంపై అవగాహన కల్పించడం తన జీవితంలో భాగంగా చేసుకుంది. కొత్తగూడెంలోని సెయింట్ మేరీస్ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న నైనిక, "విత్తనాలు నాటాలి.. మొక్కలను పెంచాలి.. పంచాలి.. పర్యావరణాన్ని పరిరక్షించాలి" అనే నినాదంతో ముందుకు సాగుతోంది.

**పుట్టినరోజు.. ప్రకృతికి కానుక!**

పుట్టినరోజు సందర్భంగా తల్లిదండ్రులు దశరథ్ రజువా, ఝాన్సీ రాణితో కలిసి నైనిక తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకు నేందుకు వెళ్లింది. అలిపిరి నుంచి కాలినడకన తిరుమల కొండకు చేరుకుంటూ.. మార్గమధ్యంలో తాను గత కొంతకాలంగా సేకరించిన వివిధ రకాల పండ్ల విత్తనాలను చల్లుతూ వెళ్లింది. వర్షాకాలం కావడంతో ఈ విత్తనాల్లో కొన్ని మొలకెత్తి మొక్కలుగా మారితే.. భవిష్యత్తులో అవే చెట్లుగా ఎదిగి వన్యప్రాణులకు ఆహారాన్ని అందిస్తాయన్నది నైనిక ఆలోచన. కోతులు, ఇతర వన్యప్రాణులకు పండ్లు లభించేలా అడవుల్లో పండ్ల మొక్కలు పెరగాలన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టింది.



**భక్తులకు కూడా పిలుపు..**

తిరుమల నడక మార్గంలో నైనిక చేస్తున్న కార్యక్రమాన్ని గమనించిన పలువురు భక్తులు ఆమెను అభినందించారు. వారికి కూడా పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించింది. "మనం తినే పండ్ల విత్తనాలను చెత్తలో పడేయకుండా సేకరించండి. వర్షాకాలంలో వాటిని సమీపంలోని అడవుల్లో చల్లండి. అవి మొలకెత్తి చెట్లుగా ఎదిగితే వన్యప్రాణులకు ఆహారం లభిస్తుంది" అంటూ నైనిక భక్తులకు వివరించింది. పుట్టినరోజు, పెళ్లిరోజు, ఇతర ప్రత్యేక సందర్భాల్లో ఖరీదైన బహుమతుల కంటే కనీసం ఒక్క మొక్కను నాటడం లేదా ఒక మొక్కను మరొకరికి బహుమతిగా ఇవ్వడం ఉత్తమమని సూచించింది.

**నాడు ఆక్సిజన్ మాస్క్‌తో.. నేడు విత్తనాలతో!**

నైనికకు పర్యావరణ పరిరక్షణపై ఉన్న ఆసక్తి ఇప్పటిది కాదు. గతంలో తిరుమల-తిరుపతి ప్రాంతంలో ఆక్సిజన్ మాస్క్ ధరించి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తూ ప్రత్యేక సందేశం ఇచ్చింది. ఇప్పుడు అదే తిరుమల కొండల్లో విత్తనాలు చల్లుతూ మరో వినూత్న సందేశాన్ని అందించింది. అంటే.. నాడు గాలి విలువను చెప్పింది.. నేడు చెట్ల అవసరాన్ని చెబుతోంది!

**మొక్కల రాజశేఖర్ వద్ద హరిత దీక్ష**

ప్రధాని నరేంద్ర మోదీ 'మన్ కీ బాత్' కార్యక్రమంలో ప్రశంసలు అందుకున్న మొక్కల రాజశేఖర్ వద్ద నైనిక ప్రకృతి హరిత దీక్ష తీసుకుంది. అప్పటి నుంచి మొక్కల పెంపకం, విత్తనాల సంరక్షణ, పర్యావరణ పరిరక్షణను మరింత బాధ్యతగా చేపట్టింది. ఇప్పటివరకు వందలాది మొక్కలు నాటడంతోపాటు.. వేలాది మొక్కలను ఇతరులకు బహుమతిగా అందిస్తూ పచ్చదనంపై ప్రచారం చేస్తోంది.

**'ప్రకృతి ఉంటేనే మనం ఉంటాం**

ప్రకృతి మనకు ఇచ్చినదాన్ని తిరిగి ప్రకృతికి ఇవ్వాలి. మనం ఈరోజు నాటే ఒక విత్తనం.. రేపు ఒక చెట్టుగా మారుతుంది. ఆ చెట్టు మనకు ఆక్సిజన్ ఇస్తుంది. పక్షులకు గూడు ఇస్తుంది. వన్యప్రాణులకు ఆహారం ఇస్తుంది. భావితరాలకు నీడనిస్తుంది. ప్రకృతి ఉంటేనే మనం ఉంటాం. నా లాంటి భావితరాలకు పచ్చని భవిష్యత్తు అందించాలంటే ప్రతి ఒక్కరూ ప్రకృతిని కాపాడాలి" అని నైనిక పిలుపునిస్తోంది.

**చిన్నారి చేతిలో విత్తనం.. రేపటి తరానికి జీవనం!**

పుట్టినరోజున కేక్ కట్ చేయడం కంటే.. ఒక విత్తనం చల్లడం గొప్ప వేడుక అని నిరూపిస్తోంది నైనిక. తన వయసు చిన్నదైనా.. ఆలోచన మాత్రం పెద్దది. తన చేతిలో ఉన్నది చిన్న విత్తనమే అయినా.. ఆ విత్తనంలో భావితరాల భవిష్యత్తును చూస్తోంది ఈ చిన్నారి.

# సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం.

**పినపాక, ప్రభాత వార్త, ఆగస్టు 10.**

ప్రజా సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపిస్తూ ప్రజా సంఘాలు ఆధ్వర్యంలో జైలు బరో కార్యక్రమాన్ని నిర్వహించారు.ఇ బయ్యారం క్రాస్ రోడ్ లో కార్మికులు,రైతులు, అంగన్‌వాడీ ఉద్యోగులు,వివిధ వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జైల్‌భరో కార్యక్రమం నిర్వహించారు.ఈ బయ్యారం క్రాస్‌రోడ్ నుంచి ఉప్పాక బ్రిడ్జి వరకు రైతు,కార్మిక, గిరిజన సంఘాల ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని ర్యాలీ నిర్వహించారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు నిమ్మల వెంకన్న మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.కార్మికుల హక్కులను పరిరక్షించడంతో పాటు ఉద్యోగ భద్రత,కనీస




వేతనాలు,సామాజిక భద్రత కల్పించాలన్నారు. కార్మిక వర్గానికి నష్టం కలిగించే విధానాలను కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సిఐటియు నాయకురాలు సోనా మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న ఆశాలు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలన్నారు . అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు కనీస వేతనాలు,పెండింగ్ బకాయిల చెల్లింపులు, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు అవసరమైన మౌలిక వసతులు,పౌష్టికాహార నిధులు సకాలంలో అందించాలని డిమాండ్ చేశారు.వ్యవసాయ రంగంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు.రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని, రైతులకు సంబంధించిన పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించి వ్యవసాయ రంగాన్ని ఆదుకోవాలన్నారు. కార్మికులు,రైతులు, గిరిజనులు, అంగన్‌వాడీ ఉద్యోగులు,ప్రజా సంఘాల ప్రతినిధులు జైల్‌భరో కార్యక్రమానికి భారీ సంఖ్యలో హాజరై మాట్లాడుతూ డిమాండ్లను పరిష్కరించే వరకు ప్రజా ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు దుబ్బ గోవర్ధన్,మడివి రమేష్,వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## ప్రజా వ్యతిరేక విధానాలపై పోరుబా ట:అన్నవరపు

**మణుగూరు, ప్రభాతవార్త, ఆగస్టు 10:**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ క్విట్ ఇండియా ఉద్యమ స్పూర్తితో చేపట్టిన జైల్ భరో కార్యక్రమం సోమవారం మణుగూరులో ఉద్రిక్తంగా మారింది. శ్రామిక భవన్ నుండి ప్రారంభమైన భారీ ర్యాలీ అంబేద్కర్ సెంటర్‌కు చేరుకోగానే నాయకులు రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా ఉద్రిక్తత నెలకొనగా పోలీసులు రాస్తారోకోను అడ్డుకున్నారు. వ్యవసాయ కార్మిక సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు అన్నవరపు కనకయ్య మాట్లాడుతూ...ప్రజా వ్యతిరేక విధానాలపై పోరుబాట నిర్వహిస్తామని అన్నారు. లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, విద్యుత్ సవరణ బిల్లు 2025ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఖిహైర్ అండ్ ఫైర్‌ఖి విధానం కార్మికులకు తీవ్ర న నష్టం కలిగిస్తుందని, రైతులకు గిట్టుబాటు ధరతో పాటు ఉచిత ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలని



స్పష్టం చేశారు. హక్కు సాధన వరకు పోరాటాలు ఆపేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం, గ్రామీణ హమాలి సంఘ నాయకులు నెల్లూరు నాగేశ్వరరావు, సత్రపల్లి సాంబశివరావు, పిట్టల నాగమణి తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పత్రికా స్వేచ్ఛని అణిచివేసే ప్రయత్నాలు సహించం.

**కలం కదిలితే.. అవినీతి,అక్రమాలు జడవాల్సిందే.**

**జర్నలిస్టుల గొంతు నొక్కొద్దు**

**అశ్వాపురం,ప్రభాతవార్త ఆగస్టు 10;**

ప్రజాస్వామ్య వ్యవస్థలో పత్రికా రంగం నాలుగో స్తంభంగా ప్రజల తరఫున ప్రశ్నించే కీలక బాధ్యతను నిర్వహిస్తోందని భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(ఎ) కల్పించిన భావ ప్రకటన స్వేచ్ఛ పరిధిలో పత్రికా స్వేచ్ఛ కి రక్షణ ఉందని అశ్వాపురం మండల జర్నలిస్టులు పేర్కొన్నారు.అధికారులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు నిర్వహించే విలేకరుల సమావేశాల్లో వారు వెల్లడించిన అభిప్రాయాలను ప్రజలకు చేరవేయడం జర్నలిస్టుల వృత్తి బాధ్యతలో భాగమన్నారు.విలేకరుల సమావేశంలో ఎవరు ఏం మాట్లాడారో వాస్తవాల ఆధారంగా వార్తగా రాయడమే తప్ప, జర్నలిస్టులు స్వతహాగా ఊహించుకుని వార్తలు సృష్టించరని స్పష్టం చేశారు. వార్తల్లో వాస్తవ దోషం ఉంటే వివరణ ఇవ్వాలని, విలేకరులను ఒత్తిడికి గురి చేయటం సరికాదన్నారు. ప్రజా సమస్యలు,అవినీతి, అక్రమాలు,అధికారుల నిర్లక్ష్యం,బాధితుల గోడును వెలుగులోకి తీసుకురావడంలో మీడియా ఎన్నో సందర్భాల్లో కీలక పాత్ర పోషించిందన్నారు.కలం ప్రశ్నించినప్పుడు వ్యవస్థ సమాధానం చెప్పాలి.కానీ కలాన్ని ప్రశ్నించడం ద్వారా సమస్య పరిష్కారం కాదని పేర్కొన్నారు.వార్తలపై అభ్యంతరాల పేరుతో జర్నలిస్టులపై ఫిర్యాదులు చేయడం,ఒత్తిళ్లు తీసుకురావడం పత్రికా స్వేచ్ఛని హరించే చర్యలుగా భావిస్తున్నామని,వార్త నచ్చకపోతే ఖండన ఇవ్వడానికి,తమ వాస్తవాలను ప్రజల ముందు ఉంచడానికి ప్రతి ఒక్కరికీ అవకాశం ఉందన్నారు.సమస్య వస్తే ఐక్యంగా పోరాడుతాం.జర్నలిస్టుల గొంతు నొక్కడం కాదు.ప్రజల సమస్యలకు పరిష్కారం చూపడమే పాలకుల బాధ్యతని మండలంలోని ఏ జర్నలిస్టు కైనా ఏ సమస్య వచ్చినా ఐక్యంగా పోరాడతామని స్పష్టం చేశారు.ప్రజా ప్రయోజనాల కోసం నిజాలను వెలుగులోకి తీసుకురావడంలో జర్నలిస్టులు ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా తమ వృత్తి ధర్మాన్ని కొనసాగిస్తారని తెలిపారు.ఒక జర్నలిస్టుపై అనవసర ఒత్తిడి వచ్చినా అశ్వాపురం మండలంలోని జర్నలిస్టులంతా ఐక్యంగా నిలబడి



పత్రికా స్వేచ్ఛాన్ని కాపాడేందుకు కృషి చేస్తామని ప్రకటించారు.జర్నలిస్టును ఆపితే ఒక వార్త ఆగవచ్చు కానీ ప్రజల ప్రశ్నలను ఆపలేరు అని స్పష్టం చేశారు.పత్రికా స్వేచ్ఛ నీ గౌరవించడం అంటే కేవలం జర్నలిస్టుల హక్కును గౌరవించడం కాదని, ప్రజలకు నిజం తెలుసుకునే హక్కును గౌరవించడమేనన్నారు.కలం ఆగదు.ప్రశ్న ఆగదు.ప్రజల కోసం పత్రికా స్వరం కూడా ఆగదని అశ్వాపురం మండల వ్యాప్తంగా ఏ జర్నలిస్టు కైనా ఇబ్బందులు తలిపితే మండల వ్యాప్తంగా ఉన్న అన్ని క్లబ్ లోని జర్నలిస్టులు ఐక్యంగా పోరాడతామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మండలంలోని ప్రెస్ క్లబ్ ల అధ్యక్షులు రాజేందర్ వెలమ,రెడ్డి మహేష్, కల్లూరు నరసింహారావు, కూరపాటి చలపతి రావు,మండలంలోని జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న కేంద్ర ప్రభుత్వం

**కామేపల్లి, ఆగస్టు 10 ప్రభాతవార్త:**

దేశంలో బిజెపి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను మర్చిపోయి పాలన ను కొనసాగిస్తే ప్రజలు సహించరని తిరుగుబాటు చేస్తారని సిపిఐ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి దండి సురేష్ హెచ్చరించారు.కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ సిపిఐ పార్టీ ఆధ్వర్యం లో మండల కార్యదర్శి పుచ్చకాయల వెంకటేశ్వర్లు సారథ్యంలో జనచైతన్య యాత్ర సోమవారం కామేపల్లి మండలం ఊట్కూర్, కామేపల్లి, తాళ్లగూడెం, కొత్త లింగాల, పండితాపురం గ్రామాల్లో కొనసాగింది.ఈ యాత్ర సందర్భంగా పలు గ్రామాల్లో జరిగిన బహిరంగ సభల్లో,కొత్త లింగాలలో జరిగిన విలేకరుల సమావేశంలో సురేష్ మాట్లాడుతూ దేశంలో బిజెపి ప్రభుత్వం మోసపూరిత అబద్దాలతో అధికారంలోకి వచ్చి 12 ఏళ్లు పూర్తి కావస్తుందని కానీ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని ఆరోపించారు.తాము అధికారంలోకి వస్తే రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని నిరుద్యోగులకు రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ధనికుల వద్ద ఉన్న నల్ల ధనాన్ని వెలికి తీసి మహిళల ఖాతాల్లో వేస్తామని ఇచ్చిన హామీలు నీటి మీద రాతలు గా మిగిలాయని ఆరోపించారు.దేశంలో దొడ్డిదారిన తీసుకొచ్చిన రైతు వ్యతిరేక నల్ల చట్టాలు అమలు చేయడానికి కేంద్ర పాలకులు ప్రయత్నిస్తే రైతులు అన్ని పార్టీలు అడ్డుకున్నాయని తెలిపారు.ఇప్పటికే దేశ సంపదను అదాని, అంబానీ లాంటి కార్పొరేట్ శక్తులకు కట్ట పెట్టానికి విశ్వ ప్రయత్నం చేస్తూ ప్రజాస్వాన్ని ఖూని చేస్తున్నారని ఆరోపించారు. దీంతో దేశం ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు . ఈ కార్యక్రమంలో జమ్ముల జితేందర్ రెడ్డి, ఎర్రబాబు, రావి శివరామకృష్ణ, ఏపూరి లతా దేవి, పోటు కళావతి, సింగు నరసింహారావు, సిహెచ్ సీతామహాలక్ష్మి, యంగల ఆనందరావు, ఇటికాల రామకృష్ణ, తాటి నిర్మల, పుచ్చకాయల వెంకటేశ్వర్లు, సతకోటి సత్యనారాయణ, బండి శ్రీను, అంబడిపూడి జగ్గయ్య, పుచ్చకాయల శ్రీను, బండి శ్రీను,కన్నమాల వెంకటేశ్వ ర్లు, పాల్గొన్నారు.




## మణుగూరు ఏరియా జేఏసీ ధర్నా




**మణుగూరు, ప్రభాతవార్త ఆగస్టు 10:**

బొగ్గు గని కార్మికుల 12వ వేతన ఒప్పందాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సింగరేణి సంస్థ మణుగూరు ఏరియా జిఎం ఆఫీస్ వద్ద ఏరియా జేఏసీ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం ఏరియా జిఎం దుర్గం రామచందర్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. 11వ వేతన ఒప్పందం గడువు తీరిపోవడంతో జూలై 1 నుంచి కొత్త వేతన ఒప్పందం అమలు కావాల్సి ఉందన్నారు. కోల్ ఇండియా యాజమాన్యం ఐదు జాతీయ సంఘాలతో చర్చించి కొత్త వేజ్ బోర్డును ఖరారు చేయాల్సి ఉన్నా, లేబర్ కోడ్లను అడ్డం పెట్టుకుని కాలయాపన చేస్తోందని మండిపడ్డారు. ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వై. రాంగోపాల్, వి. కృష్ణంరాజు, వెంకటరత్నం, కోడిపెల్లి శ్రీలత, మధుసూదన్ రెడ్డి, అన్ని యూనియన్ల బ్రాంచ్ నాయకులు, ఫిట్ సెక్రటరీలు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## మణుగూరులో రాస్తారోకో...



**మణుగూరు, ప్రభాతవార్త, ఆగస్టు10:**

కేంద్ర ప్రభుత్వ రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జాతీయ కార్మిక, రైతు సంఘాల పిలుపుమేరకు సోమవారం మణుగూరులో సిపిఐ కార్యాలయం ఎదుట సిపిఐ, ఏఐటీయూసీ, టీయూసీఐ, ఎంసీపీఐ ఆధ్వర్యంలో ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. దీంతో రహదారిపై పెద్దఎత్తున ట్రాఫిక్ స్తంభించగా పోలీస్ అధికారుల జోక్యంతో ఆందోళన విరమించారు.

ఈ సందర్భంగా సిపిఐ పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్, టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు ఆర్.మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ.. కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేలా వాణిజ్య ఒప్పందాలు చేస్తోందని మండిపడ్డారు. గిట్టుబాటు ధర లేక, విత్తనాలు, ఎరువుల ధరలు పెరిగి రైతాంగం తీవ్రంగా నష్టపోతోందన్నారు. ఉపాధి హామీ పనిదినాలను 200 రోజులకు పెంచి, రోజువారీ కూలీ 700 చెల్లించాలని, విద్యుత్ సవరణ చట్టం2025, నాలుగు లేబర్ కోడ్‌లు, స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పంటల బీమా, రుణమాఫీ, మద్దతు ధర గ్యారెంటీ చట్టం చేయకపోతే దేశవ్యాప్త ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జక్కుల రాజబాబు, ఎడారి రమేష్, రాంగోపాల్, కుటుంబరావు, గడ్డం వెంకటేశ్వర్లు, తోట రమేష్, సుజాత, సంజీవరెడ్డి, మోహనరావు తదితరులు పాల్గొన్నారు

# కార్మిక, రైతు వ్యతిరేక విధానాలకు నిరసన ప్రదర్శన

### భారీ ప్రదర్శన-రాస్తారోకో
### 150 మంది అరెస్ట్.. పోలీస్ స్టేషన్‌కు తరలింపు

**ఇల్లెందు అర్బన్, ఆగస్టు 10, ప్రభాతవార్త:**




కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సంయుక్త కిసాన్ మోర్చా, వివిధ ట్రేడ్ యూనియన్లు ఇచ్చిన పిలుపు మేరకు ఇల్లెందులో సోమవారం నిరసన కార్యక్రమాలు హోరెత్తాయి. క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో దేశవ్యాప్తంగా చేపట్టిన జైల్‌భరో కార్యక్రమంలో భాగంగా ఎస్కేయం, ట్రేడ్ యూనియన్ల ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన నిర్వహించి రాస్తారోకో చేపట్టారు.జగదాంబ సెంటర్ నుంచి బుగ్గవాగు వంతెన వరకు కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, వివిధ ప్రజా సంఘాల నాయకులు భారీగా ర్యాలీ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. దీంతో కొద్దిసేపు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయక కార్యదర్శి ఎస్.ఏ. నబి, ఏఐకేఎంఎస్ రాష్ట్ర సహాయక కార్యదర్శి నాయిని రాజు, ఏఐకేఎంఎస్ రాష్ట్ర నాయకులు తుపాకుల నాగేశ్వరరావు, ఏఐకేఎస్ మండల నాయకులు బొప్పిశెట్టి సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పలువురు నాయకులు మాట్లాడారు.కార్పొరేట్లకు వ్యవసాయ రంగాన్ని అప్పగించే కుట్రను అడ్డుకోవాలిఏఐటీయూసీ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ కాశబోయిన సారయ్య, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర నాయకులు చంద్ర అరుణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షులు కొక్కు సారంగపాణి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ సంస్థలకు అప్పగించే విధానాలను అవలంబిస్తోందని ఆరోపించారు.ఇతర దేశాలతో చేసుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల హక్కులను హరించే నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని కోరారు. గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని యథావిధిగా కొనసాగిస్తూ, సంబంధిత చట్టాన్ని పరిరక్షించాలని డిమాండ్ చేశారు.విద్యుత్ చట్ట సవరణ బిల్లును ఉపసంహరించాలిప్రజలు, రైతాంగంపై అదనపు భారాలు మోపే విద్యుత్ చట్ట సవరణ బిల్లును తక్షణమే ఉపసంహరించుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు. దేశంలో పండుతున్న పంటలకు కనీస మద్దతు ధరలు కల్పించి రైతులను ఆదుకోవాలని కోరారు. రైతులు, కార్మికుల ప్రయోజనాలను దెబ్బతీసే విధానాలను కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని స్పష్టం చేశారు.150 మంది పోలీసుల అదుపులోకి..రాస్తారోకో సందర్భంగా పోలీసులు నిరసనకారులను అదుపులోకి తీసుకున్నారు. సుమారు 150 మందిని పోలీస్ స్టేషన్‌కు తరలించి, రైతు, కార్మిక సంఘాల నాయకులను నిర్బంధించి కేసులు నమోదు చేశారని సంఘాల నాయకులు తెలిపారు. తమపై అక్రమంగా కేసులు నమోదు చేయడాన్ని వారు తీవ్రంగా ఖండించారు.ఈ కార్యక్రమంలో ఎం.డి. రాసుద్దిన్, అజ్మీర బిచ్చా, ఆలేటి కిరణ్, బంటు యాదగిరి, పూనెం రంగయ్య, పాయం వెంకన్న, మాదారపు వెంకటేశ్వర్లు, మల్లెల వెంకటేశ్వర్లు, ధారావత్ రాందాస్, కొప్పుల శ్రీనివాస్, పూనెం కుమార్, బానోత్ రామ్‌సింగ్, మహిమూద్, తిరుమలరావు, యనగంటి చిరంజీవి, రావూరి ఉపేందర్‌రావు, డి.మోహన్‌రావు, వి.మోతిలాల్ పాల్గొన్నారు.

# కామేపల్లి లో జైల్ భరో విజయవంతం

**కామేపల్లి, ఆగస్టు 10 ప్రభాతవార్త:**



కామేపల్లి మండలం లో సోమవారం నిర్వహించిన జైల్ భరో కార్యక్రమం విజయవంతం అయింది.సిఐటి యు,రైతు సంఘం, వ్యవసా య కార్మిక సంఘం సంయు క్త ఆధ్వర్యంలో కొత్తలింగాల క్రాస్ రోడ్ లో రాస్తారోకో నిర్వహించారు.ఈ సంద ర్భంగా రైతు సంఘం వైరా డివిజన్ కార్యదర్శి దుగ్గి కృష్ణ,సిఐటియు మండల కన్వీనర్ బాదావత్ శీను మాట్లాడుతూ దేశంలో 29 చట్టాలు రూపకల్పన అయి ఉంటే ఆ చట్టాలను మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని తొలగించి 4 లేబర్ కోడ్ గా మార్చి వాటిని నల్ల చట్టాలుగా మార్చి కార్మికులను,కర్షకులను, రైతులను నట్టేట ముంచారని అని తెలిపారు. ప్రజా సమస్యలను విస్మరించి చినందున కార్మికుల సంఘాల నాయకత్వం క్విట్ ఇండియా ఉద్యమస్ఫూర్తితో ఈ కార్యక్రమాన్ని నిర్వహించి నిరసన తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్ష కార్యదర్శులు కొర్ర నీల, హట్కర్ బుజ్జి,అంగన్వాడి యూనియన్ ప్రాజెక్టు అధ్యక్షురాలు దుగ్గి పాపారాణి,వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఆమంచి అంజయ్య,రైతు సంఘం నాయకులు అంబటి శ్రీనివాస్ రెడ్డి,బిల్డింగ్ వర్కర్స్ మండల నాయకులు కొత్తపల్లి ఉపేందర్,భూక్యా రమణ, రైతు సంఘం మండల అధ్యక్షులు రాయల సత్యనారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఉప్పతల వెంకన్న,కార్మిక నాయకులు ధరావత్ కోటయ్య,ఎస్ కె.ఫరీద్,వీరభద్రం,పాషా, అ దవ ఉపేందర్,రాయల నరేష్,నాగయ్య,స్వరూప, భాస్కర్,ప్రమీల,అన్ని రంగాల కార్మికులు భారీ సంఖ్యలో హాజరయ్యారు.

# కొణిజర్ల మండలంలో విషాదం

### ఆర్ఎంపి వైద్యం వికటించి బాలిక మృతి.?
### శోకసంద్రంలో కుటుంబ సభ్యులు..

**. కొణిజర్ల ఆగస్టు 10ప్రభాత వార్త:**




ప్రథమ చికిత్స చేయవలసిన ఆర్ఎంపి.. తన పరిధి దాటి వైద్యం చేయడంతో అది కాస్తా వికటించి ఓ విద్యార్థిని బలి తీసిన విషాద ఘటన ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం బస్వాపురంలో సోమవారం ఉదయం వెలుగులోకి వచ్చింది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన చల్లా రమేష్,మోనిక దంపతుల కుమార్తె చల్లా హేమశ్రీ (14) స్థానిక మండల కేంద్రంలో గల కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో 8వ తరగతి చదువుతోంది. ఆదివారం జలుబు, జ్వరంతో అస్వస్థతకు గురికావడంతో తల్లిదండ్రులు బాలికను స్థానికంగా ఉన్న ఆర్ఎంపీ వైద్యుడు సంపత్ వద్దకు తీసుకెళ్లారు. ఆర్ఎంపీ వైద్యుడు చేతికి క్యాన్యులా పెట్టి ,ఇంజెక్షన్ ఇచ్చిన అనంతరం బాలికకు శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఏర్పడింది. దీంతో వెంటనే కుటుంబ సభ్యులు ఆటోలో ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు ఈసీజీ పరీక్ష నిర్వహించి హేమశ్రీ మృతి చెందినట్లు నిర్ధారించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కుటుంబ సభ్యులు లబోదిబో మంటూ.. హేమశ్రీకి వైద్యం చేసిన సమయంలో ఆర్ఎంపీ వైద్యుడు సంపత్ మద్యం సేవించి ఉన్నాడని కుటుంబ సభ్యులు ఆరోపించారు. బాలిక మృతి చెందిన అనంతరం ఖమ్మంలో పోలీసులు సంపత్‌ను బ్రీత్ అనలైజర్‌తో పరీక్షించగా మద్యం సేవించినట్లు నిర్ధారణ అయినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. విద్యార్థిని ఆకస్మిక మృతితో బస్వాపురంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కాగా తన కుమార్తె మృతికి ఆర్ఎంపీ వైద్యుడు సంపత్ కారణమని మృతురాలి తండ్రి చల్లా రమేష్ సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, నిందితుడు పరారీలో ఉన్నట్లు ఎస్ఐ సూరజ్ తెలిపారు.




# గుత్తి కోయల గ్రామాలలో మలేరియా నిర్మూలన అవగాహన

**టేకులపల్లి, ప్రభాతవార్త:**



జిల్లా మలేరియా నివారణ అధికారి డాక్టర్ శ్రీధర్ సులానగర్ వైద్యాధికారి డాక్టర్ కంచర్ల వెంకటేష్ ల ఆదేశానుసారం సులానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని మలేరియా ప్రభావిత గుత్తికోయ గ్రామాలైన మొట్లగూడెం, సిద్దారం, నాగారపుజోగు గ్రామాల్లో మలేరియా నివారణ చర్యల్లో భాగంగా ఇండోర్ రెసిడ్యువల్ స్ప్రేయింగ్ (ఐఆర్ఎస్) కార్యక్రమాన్ని వైద్య సిబ్బంది నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఇళ్ల లోపలి గోడలపై ఆల్ఫా సైపర్‌మెత్రిన్ మందును నిబంధనల ప్రకారం స్ప్రే ఈ మందు దోమలను నియంత్రించడంలో, తద్వారా మలేరియా వ్యాప్తిని అరికట్టడంలో సహాయపడుతుంది. మలేరియా నివారణలో భాగంగా ప్రజలు ఆరోగ్య సిబ్బందికి పూర్తిగా సహకరించాలని, ఇళ్లలో స్ప్రేయింగ్ చేయడానికి వచ్చిన సిబ్బందికి సహకరించాలని అధికారులు సూచించారు. అలాగే దోమతెరలను తప్పనిసరిగా వినియోగించాలని, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జ్వరం, చలి, వణుకు, తలనొప్పి, ఒళ్లు నొప్పులు వంటి లక్షణాలు కనిపించిన వెంటనే సమీపంలోని ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించి ఉచిత మలేరియా పరీక్ష చేయించుకోవాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి జాబిశెట్టి శ్రీనివాసరావు, ఆరోగ్య విస్తరణ అధికారి బట్టు పున్నమయ్య, ధనసరి రాంబాబు, రమేష్ బాబు, స్రవంతి, సారమ్మ, కవిత పాల్గొన్నారు.

## సిపిఎస్ రద్దు చేసి ఓ పి ఎస్, పునరుద్ధరించాలి
## 23 చలో హైదరాబాద్‌కు తరలండి

**టేకులపల్లి, ప్రభాతవార్త:**



రాష్ట్రంలో 2004 నుంచి అమలులో ఉన్న కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సిపిఎస్)ను తక్షణమే రద్దు చేసి, ఉద్యోగులు-ఉపాధ్యాయులకు భద్రత కల్పించే పాత పెన్షన్ విధానం ( ఓ పి ఎస్ )ను పునరుద్ధరించాలని తెలంగాణ దివ్యాంగ ఉద్యోగ ఉపాధ్యాయ సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శి బాణోతు లక్ష్మ ప్రభుత్వాన్ని త్వరగా పరిష్కారం చేయాలని కోరారు. జీవితాంతం ప్రభుత్వ సేవలో ఉన్న ఉద్యోగులకు పదవీ విరమణ అనంతరం గౌరవప్రదమైన జీవితం గడిపేలా పెన్షన్ భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. సిపిఎస్ విధానం వల్ల పదవీ విరమణ అనంతరం అనేక మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సరిపడా పెన్షన్ లభించక వృద్ధాప్యంలో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. "ప్రభుత్వ ఉద్యోగం చేసిన తర్వాత కూడా వృద్ధాప్యంలో ఆర్థిక భద్రత లేకపోవడం అత్యంత బాధాకరం. ఉద్యోగుల భవిష్యత్తుకు భరోసా కల్పించేది ఓ పి ఎస్ మాత్రమే" అని అన్నారు రాష్ట్ర ఉద్యోగ ఉపాధ్యాయులకు సంబంధించిన పలు సమస్యలు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్నాయని బాణోతు లక్ష్మ తెలిపారు. పి ఆర్ సి ఆలస్యం, పెండింగ్ డి ఎ లు, సిపిఎస్ బకాయిలు, ఉద్యోగుల బదిలీలు, ప్రమోషన్ల తదితర సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు . ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో కాలయాపన చేయకుండా ప్రభుత్వం చర్చలు జరిపి న్యాయం చేయాలని కోరారు.

## నేడు పండితాపురం లో విద్యుత్ సరఫరా నిలుపుదల

**కామేపల్లి, ఆగస్టు 10 ప్రభాతవార్త:**

క పండితాపురం ఫీడర్,గ్రామం లో లైన్ కు తగిలే చెట్ల కొమ్మలను తొలగించడం, ట్రాన్స్ ఫార్మర్ల మరమ్మతు పనులు మంగళవారం నిర్వహిస్తున్నట్లు కొత్త లింగాల ట్రాన్స్ కో ఏ ఈ ఎన్.శ్రీనివాసులు సోమవారం తెలిపారు. అట్టి పనుల వలన పండితాపురం, అబ్బాస్ పురం గ్రామాలలో, ఏరి యాలలో వ్యవసాయ, గృహ వినియోగదారులకు ఉదయం 8:30గంటల నుంచి మధ్యాహ్నం 12:00 గంటల వరకు విద్యుత్ సరఫరా ను నిలిపి వేస్తున్నట్లు తెలిపారు.ఈ విషయాన్ని గమనించి అంతరాయమునకు విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

# పీఎంశ్రీ పాఠశాలల్లో యోగా-స్వీయరక్షణ బోధకుల ఎంపికకు పరీక్షలు

ప్రభాతవార్త ప్రతినిధి, జనగామ : జిల్లాలోని పీఎంశ్రీ పాఠశాలల్లో విద్యార్థులకు యోగా, స్వీయరక్షణ శిక్షణను అందించేందుకు బోధకుల ఎంపిక ప్రక్రియలో భాగంగా ఆదివారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మెయిన్ కాన్ఫరెన్స్‌హాల్లో పరీక్షలు, డెమో నిర్వహించారు. జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆధ్వర్యంలో ఈ ఎంపిక ప్రక్రియ చేపట్టారు. పీఎం శ్రీ పాఠశాలల్లో విద్యార్థుల శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించడంతోపాటు స్వీయరక్షణ నైపుణ్యాలను అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో యోగా, స్వీయరక్షణ బోధకులను ఎంపిక చేస్తున్నారు. ఇందులోభాగంగా 15యోగా టీచర్ పోస్టులకు 22మంది అభ్యర్థులు పరీక్షలు, డెమోకు హాజరయ్యారు. అభ్యర్థుల నైపుణ్యం,



బోధనా సామర్థ్యాన్ని పరిశీలిస్తూ ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. అదేవిధంగా 15స్వీయ రక్షణ (సెల్ఫ్ డిఫెన్స్) ఇన్‌స్ట్రక్టర్ పోస్టులకు 37మంది అభ్యర్థులు పరీక్షలు, డెమోలో పాల్గొన్నారు. అభ్యర్థుల శిక్షణ సామర్థ్యం, విద్యార్థులకు స్వీయరక్షణ అంశాలను బోధించే విధానాన్ని పరిశీలించినట్లు అధికారులు తెలిపారు. ఇదే సమయంలో అంతర్జాతీయ ఎక్స్‌పోజర్ విజిట్‌కోసం ఉపాధ్యాయుల ఎంపిక ప్రక్రియను కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లాకు చెందిన 10మంది ఉపాధ్యాయులు పరీక్షకు హాజరయ్యారు. పరీక్షల ఆధారంగా అర్హులైన ఉపాధ్యాయులను అంతర్జాతీయ ఎక్స్‌పోజర్ విజిట్‌కు ఎంపిక చేయనున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోం, విద్యాశాఖ ఏడీ శ్రీనివాస్ తదితర అధికారులు పాల్గొన్నారు.




## చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

దమ్మపేట రూరల్ ఆగస్టు 10 ప్రభాతవార్త :




సెప్టెంబర్ ఒకటిన చలో ఢిల్లీ నిర్వహించ తలపెట్టిన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిపిఐ మండల కార్యదర్శి సుంకిపాక ధర్మ, జిల్లా కౌన్సిల్ సభ్యుడు యార్లగడ్డ ఈశ్వరరావు అన్నారు. సోమవారం సిపిఐ మండల కార్యాలయంలో కూకలకుంట సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ జాతీయ భారత కమ్యూనిస్టు, సిపిఐ పార్టీ పిలుపుమేరకు చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం అధికారంలో ఉన్న దశాబ్ద కాలంలో అభివృద్ధి, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు, సంక్షేమం అందిస్తామని వాగ్దానం చేసి కుల, మతాల పేరిట రాజకీయం చేస్తుందన్నారు. విద్యుత్, వైద్యం, గ్యాస్ ధరలు, నిత్యావసర ధరలు విపరీతంగా పెరిగాయని ధరల నియంత్రణలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ వినూత్నమైన ప్రజా మార్పుకు శ్రీకారం చుట్టిందని గల్లీలోనే కాదు ఢిల్లీలో కూడా ప్రజా సమస్యలపై పోరాడుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్.కె జాన్ బి, నక్క నాగమణి, రాజు బోయిన కృష్ణవేణి, మెరుగు వసంత కుమారి తదితరులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

**- ఏఎంసీ చైర్మన్ బనుక శివరాజ్‌యాదవ్**

జనగామ టౌన్, ఆగస్టు 10 ప్రభాతవార్త : ప్రజాప్రభుత్వ పాలనలో ప్రతిరైతుకు న్యాయంజరిగేలా చర్యలు తీసుకుంటున్నామని, రైతేరాజుగా ఎదగాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్‌యాదవ్ అన్నారు. ప్రజాపాలనలో భాగంగా జనగామ మండలం శామీర్‌పేట గ్రామంలో రైతులకోసం ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. గ్రామపంచాయతీ సర్పంచ్ గనిపాక వనిత అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్‌యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అనుకూలమైన పంటల సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం పలుచర్యలు చేపడుతోందన్నారు. వాతావరణ పరిస్థితులు, ఇతర కారణాలవల్ల రైతులకు ఇబ్బందులు ఎదురైనప్పుడు ప్రత్యామ్నాయ పంటల సాగువైపు ప్రోత్సహించడంతో పాటు, ప్రభుత్వం సబ్సిడీపై విత్తనాలను అందిస్తున్నట్లు తెలిపారు. రైతులకు అవసరమైన సమయంలో




విత్తనాలు, ఇతర వ్యవసాయ సహాయం అందేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. సాగునీటి విషయంలోనూ రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని బనుక శివరాజ్ యాదవ్ తెలిపారు. సాగునసమయానికి చెరువులను నీటితో నింపేందుకు రిజర్వాయర్ల నుంచి రెండువిడతలుగా నీటిని విడుదలచేసే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టనున్నట్లు చెప్పారు. సాగునీరు అందుబాటులోకి వస్తే రైతులు సమయానికి పంటలు సాగుచేసుకునే అవకాశం ఉంటుందన్నారు. రైతులు సంప్రదాయ పంటలతోపాటు హార్టికల్చర్, పండ్ల తోటలు, ఆయిల్‌పామ్ వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగుచేయాలని ఆయన సూచించారు. ఆయా పంటల ద్వారా రైతులు మంచి దిగుబడులు సాధించి ఆర్థికంగా అభివృద్ధి చెందేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తోంద న్నారు. వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతంచేసి రైతుల ఆదాయాన్ని పెంచడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. గ్రామసభలో రైతులు తమసమస్యలు, సాగుకు సంబంధించిన అవసరాలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. రైతులకు అందుతున్న ప్రభుత్వ పథకాలు, వ్యవసాయ సంబంధిత అంశాలపై అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి పాండు, ఏపీఎం శంకరయ్య, ఏవో సుమలత, మాజీ ఎంపీటీసీ గనిపాక మహేందర్, గ్రామ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు చాడగొండ కృష్ణారెడ్డి, ఎర్రవెల్లి ఆనందం, బత్తుల లక్ష్మీనారాయణ, పత్తి రవి, మంద్ర కుమార్, సమ్మయ్య, ఆయిలయ్య, కారోబార్ పాషాతోపాటు మహిళాసంఘాల నాయకులు, రైతులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఓం నమఃశివాయ నామస్మరణతో మార్మోగిన సిద్దులగుట్ట

బచ్చన్నపేట, ఆగస్టు 10 ప్రభాతవార్త : బచ్చన్నపేట మండలం కొడవటూరు శ్రీ సిద్ధేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం మహాగిరి ప్రదక్షిణ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వివిధ ప్రాంతాలనుంచి వందలాది మంది భక్తులు తరలివచ్చి సిద్దులగుట్ట చుట్టూ మహాగిరి ప్రదక్షిణచేసి, అనంతరం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించారు. గిరిప్రదక్షిణ సందర్భంగా సిద్దులగుట్ట ప్రాంతం ఓం నమఃశివాయ నామస్మరణతో మార్మోగింది. ఈసందర్భంగా ఈవో చిందం వంశీ మాట్లాడుతూ సిద్ధేశ్వరస్వామి దేవస్థానాన్ని ప్రముఖ శైవక్షేత్రంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. భక్తులకు తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యం, విశ్రాంతి సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నీల కవితమురళి, దేవస్థానం చైర్మన్ వెంకట్‌రెడ్డి, డైరెక్టర్లు ప్రధాన పూజారి ఓం నమశివాయ, శ్రీనివాస్, లక్ష్మీకాంత్‌రెడ్డి, దేవస్థానం సిబ్బంది భానుప్రకాశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా డా.జె.వెంకటేశ్వర్లు నియామకం

**- ఘనంగా సన్మానించిన జనగామ జిల్లా గిరిజన సంఘాల నాయకులు**

జనగామ టౌన్, ఆగస్టు 10 ప్రభాతవార్త : వరంగల్‌లోని కాళోజీ నారాయణరావు ఆరోగ్యవిజ్ఞాన విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా భూపాలపల్లి జిల్లా ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్, ఆర్థోపెడిక్ ప్రొఫెసర్ డా.జె. వెంకటేశ్వర్లును ప్రభుత్వం నియమిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. ఈ సందర్భంగా జనగామ జిల్లాకు చెందిన వివిధ గిరిజనసంఘాల నాయకులు డా.వెంకటేశ్వర్లును ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈసందర్భంగా ఆల్ ఇండియా బంజారా సేవాసంఘం జనగామ జిల్లాఅధ్యక్షుడు భూక్య వాసు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఆరోగ్యరంగం వేగంగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా డా.వెంకటేశ్వర్లును నియమించడం



సంతోషకరమన్నారు. రాబోయే మూడేళ్లపాటు ఆయన ఈ బాధ్యతల్లో కొనసాగనున్నారని తెలిపారు. ఆరోగ్య తెలంగాణ నిర్మాణంలో భాగంగా వైద్యవిద్యను మరింత అభివృద్ధి చేయడంలో డా.వెంకటేశ్వర్లుకు కీలకపాత్ర పోషించే అవకాశం ఉందని పేర్కొన్నారు. డా.వెంకటేశ్వర్లు గత 20ఏళ్లకుపైగా ఉత్తర తెలంగాణకు ప్రధాన వైద్యకేంద్రంగా ఉన్న ఎంజీఎం ఆసుపత్రిలో ఆర్థోపెడిక్ ప్రొఫెసర్‌గా విశేష సేవలు అందించారని భూక్య వాసు గుర్తుచేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పేదలకు మెరుగైన వైద్యసేవలు అందిస్తూ తనవృత్తికి న్యాయం చేశారని, ఆయనసేవలు పలువురి ప్రశంసలు పొందాయని కొనియాడారు. ప్రస్తుతం కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా నియమితులైన నేపథ్యంలో వైద్యవిద్య, ఆరోగ్యరంగంలో మరిన్ని సేవలు అందించాలని ఆకాంక్షించారు. సన్మాన కార్యక్రమంలో ఆల్‌ఇండియా బంజారా సేవాసంఘం జిల్లాప్రధాన కార్యదర్శి బి.హరిలాల్, ఎల్‌హెచ్‌పీఎస్ జనగామ జిల్లాఅధ్యక్షుడు లకావత్ నరేష్, హెచ్‌డబ్ల్యూసంఘం నాయకుడు ధరావత్ దేవేందర్, రిటైర్డ్‌టీచర్ల సంఘం నాయకుడు ధరావత్ నాగేందర్, గెజిటెడ్ హెడ్‌మాస్టర్ల సంఘం నాయకుడు బానోతు రవీందర్, పుర ప్రముఖులు బానోతు దసరు, ధరావత్ కీమా, గుగులోతు లచ్చిరాం, రిటైర్డ్ ఎల్‌ఐసీ ఉద్యోగి ధరావత్ సోమ్లానాయక్, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం నాయకులు అజ్మీర కిషన్, జాటోతు గోరిసింగ్, జాటోతు లచ్చిరాం తదితరులు పాల్గొని డా.వెంకటేశ్వర్లుకు శుభాకాంక్షలు తెలిపారు.

## శాకంబరి అలంకరణలో రాజరాజేశ్వరి అమ్మవారు

**- భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు**

జనగామ టౌన్, ఆగస్టు 10 ప్రభాతవార్త : జనగామ జిల్లా కేంద్రంలోని గుండ్లగడ్డ కాలనీలో ఉన్న శ్రీఉమామహేశ్వర దేవాలయంలో రాజరాజేశ్వరి అమ్మవారికి సోమవారం శాకంబరి అలంకరణలో ప్రత్యేకపూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ అర్చకులు అయ్యగారు సాంబమూర్తిశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అర్చనలు, పూజాకార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధరకాల కూరగాయలు, ఆకుకూరలు, పండ్లతో రాజరాజేశ్వరి అమ్మవారిని శాకంబరి అలంకరణలో సుందరంగా అలంకరించారు. ప్రత్యేక అలంకరణలో కొలువుదీరిన అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్దసంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు.

# సంక్షోభంలో వ్యవసాయ రంగం




ప్రజాస్వామ్యం పరిరక్షణకు మార్పు అవసరం

**కారేపల్లి ఆగస్టు 10 ప్రభాతవార్త**

నేడు కేంద్ర ప్రభుత్వ అస్తవ్యస్త విధానాల ఫలితంగా దేశంలో వ్యవసాయ రంగం పూర్తి సంక్షోభంలో పడిందని ప్రజాస్వామ్యం ప్రమాద అంచున ఉందని ప్రజాస్వామ్య పరిరక్షణకు మార్పు అత్యవసరమని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ తెలిపారు ప్రజలను చైతన్యవంతం చేసేందుకే మార్పు కోరుతూ గ్రామ గ్రామాన సిపిఐ జన చైతన్యా యాత్ర చేపట్టిందని ఆయన తెలిపారు సోమవారం సిపిఐ జన చైతన్య యాత్ర సింగరేణి మండల పరిధిలోని పలు గ్రామాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా మాదారం కారేపల్లి కారేపల్లి క్రాస్ రోడ్ లో జరిగిన సభలో సురేష్ మాట్లాడుతూ రైతుల సంక్షేమాన్నిస్మరించి కార్పొరేట్ సంస్థలకు ప్రయోజనం చేకూర్చే విధంగా లక్షలాది కోట్ల రూపాయలు కేంద్రం రద్దు చేసిందని విమర్శించారు. ఎన్నికల్లో ప్రజలను మభ్యపెట్టికేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 12 సంవత్సరాల క్రితం అధికారంలోకి వచ్చారో కేంద్ర ప్రభుత్వం ఏ ఒక్కటీ అమలు చేయలేదన్నారు .హామీలు అమలు చేయకపోగా ప్రజలను ఇబ్బంది పెడుతూ బతకలేని స్థితికి నెట్టి వేశారని తెలిపారు. రైతాంగం ఆర్థిక పరిస్థితిని మెరుగు పరచక పోగా వ్యవసాయ రంగాన్ని మరింత సంక్షోభంలోకి నెట్టివేశారని రసానిక ఎరువులు పురుగు మందులు ధరలను ఐదు సంవత్సరాల్లోనే రెట్టింపు చేశారన్నారు. లక్షల కోట్లు కార్పొరేట్ అధిపతులకు అప్పులను రద్దు చేసిన మోడీ సర్కార్ రైతంగానికి చెందిన నయా పైసా అప్పులను కూడా రద్దు చేయలేదని ఇది మోడీ కార్పొరేట్ ప్రేమకు రైతుల పట్ల వివక్షతకు నిదర్శనమని అన్నారు. జయరామంటూ రామనామాన్ని జపిస్తూ రాముడి నిధులకే టోపీ పెట్టారని అయోధ్య రామాలయంలో నిధులను కాజేసిన వ్యక్తులపై చర్యలకు సిపిఐ డిమాండ్ చేస్తుందన్నారు .మోడీ విధానాలు సంపూర్ణల వర్గాలకు వరంగా మారుతున్నాయని అందుకే కార్పొరేట్లను మోడీ పాలనను కోరుకుంటున్నారని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వందలాది హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని ఉచిత బస్సు సన్నబియ్యం తప్ప ఏ హామీలను నెరవేర్చలేదని మిగిలిన హామీలు అమలుగురించి కనీసం పట్టించుకోవడంలేదని సురేష్ తెలిపారు రుణమాఫీలో ఘోరంగా విఫలమైందని 50 రుణమాఫీ సక్రమ పద్ధతిలో జరగలేదన్నారు జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు రుణమాఫీ పై వివిధ సందర్భాలు ఇచ్చిన హామీల హామీపై ఎప్పుడూ స్పందించడం లేదన్నారు నిరక్షరాస్యులు అయిన రైతుల పట్ల యూరియా యాప్ శాపంగా మారిందని బహిరంగంగా మార్కెట్లో ఎరువులు అందుబాటులో ఉంచాలని సిపిఐ డిమాండ్ చేస్తుంది అన్నారు ప్రభుత్వ శాఖలలో లోపించిన జవాబిదారితనం పైన మంత్రుల స్పందించాలని ప్రభుత్వ కార్యాలయాలకు సామాన్యుడు వెళ్లే పరిస్థితి లేదన్నారు అనేక చారిత్రక పోరాటాలతో హక్కులను పథకాలను సక్రమంగా సాధించిందని సిపిఐ ఎప్పుడు ఎన్నికల సందర్భంగా మోడీ రాష్ట్రంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తుందని తగు రీతులో స్పందించకపోతే పోరాటాలు ప్రజా అగ్రహాన్ని ఎదురుకొక తప్పదని సురేష్ వివరించారు సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి రాష్ట్ర సమితి సభ్యులు యార్రబాబు ఏపూరి లతా తదితరులు ప్రసంగించగా జిల్లా కార్యవర్గ సభ్యులు అజ్మీర్ రామ్మూర్తి రావి శివరామకృష్ణ పోటు కళావతి సిహెచ్ సీతామహాలక్ష్మి యంగళ అనందరావు జిల్లా నాయకులు శ్రావణ్ తాటి నిర్మల పుచ్చకాయల వెంకటేశ్వర్లు తాతా వెంకటేశ్వర్లు వీరు నాయక్ ఉంగరాల సుధాకర్ రావు చెన్నం శెట్టి భూసయ్య దల్ సింగ్ పుచ్చకాయల శ్రీను బట్టు సంగయ్య బొమ్మల కృష్ణ రాయల రామారావు అమ్మూర్ జానీ తదితరులు పాల్గొనగా మాదారం మాజీ సర్పంచ్ అజ్మీర నరేష్ పలువురు కాంగ్రెస్ నాయకులు సంఘీభావం తెలిపారు




## ప్రగతిశీల తల్లి తండ్రుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గా ఆదూరి ప్రసాద్

**కామేపల్లి, ఆగస్టు 10 ప్రభాతవార్త :**



ప్రగతిశీల తల్లి తండ్రుల సంఘం (పి పి ఎల్ ) ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి గా కామేపల్లి మండలం పండి తాపురం గ్రామానికి చెందిన ఆదూరి ప్రసాద్ ను నియమించినట్లు పిపిఎల్ రాష్ట్ర రిసోర్స్ పర్సన్, ఖమ్మం జోన్ ఇంచార్జ్ ఐనాల పరశురాములు సోమవారం తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రం లోని సిద్దార్థ ప్రకృతి ఆరోగ్య కేంద్రం ఆవరణలో జరిగిన ఖమ్మం జోన్ స్థాయి మహబూబాబాద్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల నిర్మాణ సన్నాహక సమావేశం లో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా నూతన పిపిఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఆదూరి ప్రసాద్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో పీపీఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీ వంగా ఎన్నిక చేసినందుకు, ఎన్నికకు సహాయ, సహకారాలు అందించిన రాష్ట్ర ఫౌండర్ చైర్మన్ మచ్చ నర్సయ్య, రాష్ట్ర అధ్యక్షులు ఈదుల రామాంజనేయులు, రాష్ట్ర రిసోర్స్ పర్సన్ డాక్టర్ పిసి వీరస్వామి, రాష్ట్ర రిసో ర్స్ పర్సన్, ఖమ్మం జోన్ ఇం చార్జ్ ఐనాల పరశురాము లు కు ఖమ్మం జిల్లా నాయకత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో సంఘం నిర్మాణానికి విద్యార్థిని, విద్యార్థుల సమస్యలు, విద్యార్థుల అభివృద్ధికి, ఎదుగుదలకు అందరికి అందుబాటులో ఉంటూ, అందరిని కలుపుకొని శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆదూరి ప్రసాద్ తెలిపారు.

## సాగునీటి వనరులకు శాశ్వత పరిష్కారం కావాలి



**కారేపల్లి ఆగస్టు 9 ప్రభాతవార్త**

సింగరేణి మండలంలో రైతులకు సాగునీరు ఇబ్బంది కలగకుండా సాగునీటి వనరులపై శాశ్వత పరిష్కారం కావాలని సీనియర్ కాంగ్రెస్ నాయకులు గుడిపూడి తిరుమలరావు వైరా శాసనసభ్యులు మాలోత్ రాందాస్ నాయక్ కు విన్నవించారు. ఖమ్మంలో సోమవారం ఎమ్మెల్యే ను కలిసి సాగునీరుకై రైతులు పడుతున్న ఇబ్బందులను విన్నవించారు. మండల పరిధిలోని చీమలవారి గూడెం సమీపంలో గల బుగ్గ వాగు, నాగరాజు కట్టు నుంచి అనంతారం, గేట్ కారేపల్లి చెరువులకు సాగునీరు అందేలా చేపట్టాల్సిన నీటి ప్రణాళికను వివరించారు. ఈ ప్రాంత రైతుల సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా, చెరువులకు నీరు అందించి వ్యవసాయానికి మరింత ప్రోత్సాహం కల్పించే విధంగా అవసరమైన చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే ని కోరారు. వాస్తవానికి మండలంలో ప్రవహిస్తున్న వాగుల వరద నీటిలో మళ్ళిస్తే వందలాది ఎకరాల భూములకు నీరు సమకూరి అవకాశం ఉందన్నారు. ఎన్నో సంవత్సరాలుగా మండలంలోని అనేక చెరువుల్లో కుంటలలో నాలుగైదు అడుగులకు పైగా పూడిక పేరు కొనిపోయి వర్షపు నీరు నిల్వ ఉండటలేదన్నారు. ఇరిగేషన్ శాఖ ద్వారా నిధులు మంజూరు చేసి పూడిక తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు

## రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను నశించాలి

**కారేపల్లి ఆగస్టు 10 ప్రభాతవార్త**



కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతు కార్మిక వ్యతిరేక విధానాల కు వ్యతిరేకంగా ఉద్యమించాల్సిన అవసరం వచ్చిందని సంయుక్త కిసాన్ మోర్చా నేతలు అన్నారు. సంయుక్త కిసాన్ మోర్చా పిలుపులో భాగంగా, సిపిఐ (ఎం.ఎల్) మాస్ లైన్ అనుబంధ అఖిల భారత ఐక్య రైతు సంఘం, ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం ల ఆధ్వర్యంలో కారేపల్లి మండల కేంద్రంలోని సినిమా సెంటర్లో "జైల్ భరో" నిరసన కార్యక్రమాన్ని పసోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిల భారత ఐక్య రైతు సంఘం డివిజన్ కార్యదర్శి గుగులోత్ తేజ నాయక్, సిపిఐ (ఎం.ఎల్) మాస్ లైన్ టేకులగూడెం సర్పంచ్ మండల కార్యదర్శి గుమ్మడి సందీప్, టి యు సి ఐ సంయుక్త మండల ప్రధాన కార్యదర్శి ధరావత్ సక్రు అధ్యక్షుడు నాగేశ్వరరావు, ధరావత్ సక్రు, పి వై ఎల్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వి రాకేష్, ఏఐకేఎస్ డివిజన్ నాయకులు రావుల నాగేశ్వరరావు లు మాట్లాడుతూ కనీస మద్దతు ధరల గ్యారంటీ చట్టం మరియు సమగ్ర రుణ విమోచన చట్టాలను తక్షణమే తీసుకరావాలి. అన్నారు అమెరికా, బ్రిటన్, న్యూజిలాండ్ దేశాలతో చేసుకున్న రైతు వ్యతిరేక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను రద్దు చేయాలన్నారు. విద్యుత్ సవరణ బిల్లును తక్షణమే ఉపసంహరించుకోవా లని కార్మికుల హక్కులను కాలరాసే 4 లేబర్ కోడ్లను రద్దు చేసి, రైతులకు ఉపయోగపడేలా పంటల బీమా పథకాన్ని పునర్నిర్మించా లని కోరారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తూ సామాన్య ప్రజలు, రైతులు, కార్మికుల పొట్ట కొడుతున్నాయని, ఈ రైతు కార్మిక పోరాటాన్ని ఇలాగే కొనసాగిస్తామని నాయకులు స్పష్టం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో నాయకులు గుగ్గిల రాము, గుమ్మడి ఎర్రయ్య, గుమ్మడి కిరణ్, గుమ్మడి కళ్యాణ్, ఇతర ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు, స్థానిక రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రైతన్నల సంక్షేమం కోసం మహా వరుణ యాగం



**వైరా టౌన్ ఆగస్టు 10 (ప్రభాతవార్త)**

రైతాంగం సుభిక్షంగా ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, నాగార్జునసాగర్ ఖమ్మం జిల్లా, ముఖ్యంగా వైరా నియోజకవర్గ రైతాంగం సుభిక్షంగా, సంతోషంగా ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని ఆకాంక్షిస్తూ నాగార్జునసాగర్లో సోమవారం నిర్వహించిన మహా వరుణ యాగంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తో కలిసి వైరా శాసనసభ్యులు మాలోత్ రాందాస్ నాయక్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి ప్రతి ప్రాజెక్టు, చెరువు, కుంట నిండాలని, రైతులకు సాగునీటి కొరత లేకుండా పంటలు పుష్కలంగా పండాలని ఆకాంక్షించారు. ముఖ్యంగా ఖమ్మం జిల్లా, వైరా నియోజకవర్గంలోని రైతాంగం సుఖసంతోషాలతో, ఆర్థికంగా అభివృద్ధి చెందాలని వరుణ దేవుడిని ప్రార్థించినట్లు తెలిపారు. రైతు సంక్షేమం, వ్యవసాయ అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశాలని ఆయన పేర్కొన్నారు. రైతులకు సాగునీరు అందుబాటులో ఉండటం, సమృద్ధిగా వర్షాలు కురవడం ద్వారా వ్యవసాయ రంగం మరింత బలోపేతం అవుతుందని అన్నారు. రైతన్నల జీవితాల్లో వెలుగులు నింపేలా, పంటలు పండించే ప్రతి రైతు కుటుంబం సంతోషంగా ఉండేలా ప్రకృతి అనుకూలంగా ఉండాలని కోరుకుంటూ మహా వరుణ యాగంలో ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుంది. రైతు సంతోషంగా ఉంటేనే తెలంగాణ సుభిక్షంగా ఉంటుంది అని ఎమ్మెల్యే రాందాస్ నాయక్ అన్నారు. ఈ మహా వరుణ యాగం సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ సమృద్ధిగా వర్షాలు కురిసి, జలాశయాలు, చెరువులు, కుంటలు నిండిపోయి, తెలంగాణ పచ్చని పంటలతో కళకళలాడాలని ఆయన ఆకాంక్షించారు.

## ముచ్చర్ల లో ముమ్మరంగా క్లోరినేషన్ దోమల నివారణకు చర్యలు

**కామేపల్లి, ఆగస్టు 10 ప్రభాతవార్త:**

కామేపల్లి మండలం ముచ్చర్ల గ్రామంలో సర్పంచ్ జాటోత్ జాయ్ లూసీ ఆధ్వర్యంలో సోమవారం ముమ్మరంగా క్లోరినేషన్ నిర్వహించారు. స్థానిక ఎస్సీ బాలుర వసతి గృహం, పశు వైద్యశాల, పంచాయతీ కా ర్యాలయం, రహదారులకు ఇరువైపులా దోమల నివార ణకు తగు చర్యలు తీసుకు న్నారు. బ్లీచింగ్ చల్లి శుద్ధి చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ లూసీ మాట్లాడుతూ ప్రజలు తమ పరిసరాలను వర్షాకాలం దృష్ట్యా పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిల్వ ఉండకుండా తగిన చర్యలు తీసుకోవాలని, సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంటుందని స్పష్టం చేశారు. ఆరోగ్యమే మహాభాగ్యం అన్నారు. అనంతరం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగిస్తున్న చెట్ల కొమ్మలను తొలగించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, స్థానికులు, విద్యుత్ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సెలవు రోజుల్లో మట్టి మాఫియా దందా!

**పాల్వంచలో గుట్టల తవ్వకాలు..**

**అధికారుల నిఘా ఎక్కడ.?**

**పాండురంగాపురం పరిధిలో**

**జేసీబీలతో మట్టి తవ్వకాలు..**

**పదుల సంఖ్యలో ట్రాక్టర్లతో తరలింపు**



**పాల్వంచ, ఆగస్టు 10 ప్రభాతవార్త:**

సెలవు రోజు వచ్చిందంటే చాలు.. మట్టి మాఫియా యంత్రాలు గుట్టల్లోకి దూసుకెళ్తున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పాల్వంచ మండలం పాండురంగాపురం గ్రామపంచాయతీ పరిధిలోని నర్సంపేట గుట్టల్లో జేసీబీలతో మట్టి తవ్వకాలు చేపట్టి, పదుల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా మట్టిని యథేచ్ఛగా తరలిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**గుట్టలు గుల్ల.. మట్టి తరలింపు ఫుల్!**

పగలు, రాత్రి తేడా లేకుండా మట్టి తవ్వకాలు, రవాణా సాగుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. భారీ యంత్రాలతో గుట్టలను తవ్వుతూ సహజ వనరులను కొల్లగొడుతున్నా సంబంధిత శాఖల అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా సెలవు రోజులను అనుకూలంగా మార్చుకుని దందా కొనసాగిస్తున్నారన్న ఆరోపణలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి.

**అనుమతులు ఉన్నాయా..?**

నర్సంపేట గుట్టల్లో జరుగుతున్న మట్టి తవ్వకాలకు సంబంధిత శాఖల నుంచి అనుమతులు ఉన్నాయా? మట్టి తవ్వకాలకు, తరలింపునకు నిబంధనల ప్రకారం అనుమతులు తీసుకున్నారా? ప్రభుత్వానికి చెల్లించాల్సిన రుసుములు చెల్లిస్తున్నారా? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

**అధికారుల నిఘా ఏదీ?**

ఒకవైపు సహజ వనరుల పరిరక్షణపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు చెబుతుండగా.. మరోవైపు గుట్టల తవ్వకాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు రావడం అధికారుల పర్యవేక్షణపై అనుమానాలకు తావిస్తోంది. అక్రమ మట్టి తవ్వకాలు జరుగుతున్నాయా లేదా అన్నది సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి తేల్చాల్సిన అవసరం ఉంది.

**ప్రభుత్వ ఆదాయానికి గండి.. ప్రకృతి సంపదకు నష్టం!**

అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు, అక్రమ రవాణా జరుగుతున్నట్లయితే ప్రభుత్వ ఆదాయానికి గండి పడటంతో పాటు సహజ వనరులకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి నర్సంపేట గుట్టల్లో ప్రత్యేక తనిఖీలు చేపట్టి, తవ్వకాలకు సంబంధించిన అనుమతులు, వాహనాల రవాణా, మట్టి తరలింపు వివరాలను పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు. సెలవు రోజులను అడ్డాగా చేసుకుని సాగుతున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న మట్టి దందాపై అధికారులు కొరడా ఝుళిపిస్తారా? లేక యథావిధిగా చూసీచూడనట్లు వ్యవహరిస్తారా? అన్నది వేచి చూడాల్సిందే.

# మానుకోటలో కదంతొక్కిన ఎర్రదండు

**-పోలీసులు నాయకుల మధ్య తోపులాట**

**-పలువురి నాయకుల అరెస్ట్**



**మహబూబాబాద్ ప్రతినిధి,ప్రభాతవార్త:**

రాష్ట్ర వ్యాప్తంగా సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన జైల్‌బరో కార్యక్రమంలో భాగంగా సోమవారం మానుకోటలో సిపిఎం నాయకులు కదం తొక్కారు. సిపిఎం కార్యాలయం నుంచి తహసిల్దార్ కార్యాలయం వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. వివేకానంద సెంటర్ మదర్ తెరిసా సెంటర్ అండర్ బ్రిడ్జి ప్రభుత్వ ఆసుపత్రి నెహ్రూ సెంటర్ ఇంద్రగాంధీ సెంటర్ మీదుగా తాసిల్దార్ సెంటర్‌కు నానాదాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ బిజెపి ప్రభుత్వ ఆవులంబిస్తున్న కార్మిక కర్షక రైతాంగ వ్యతిరేక విధానాలకు నిరసనగా చేపట్టిన జైలు భరో కార్యక్రమంలో వేలాది మందితో భారీ ప్రదర్శన నిర్వహించారు. పోలీసులకు సిపిఎం, సిఐటియు నాయకులకు మధ్య తోపులాట జరిగింది. పలువురు సిపిఎం నేతలను పోలీస్ స్టేషన్‌కు తరలించడంతో ఆగ్రహించిన కార్యకర్తలు పోలీస్ స్టేషన్ ముట్టడించి ధర్నా చేశారు. పోలీసులు 15 మంది సిపిఎం, సిఐటియు నాయకులను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక కార్షక రైతాంగ వ్యతిరేక విధానాల మూలంగా అన్ని వర్గాల ప్రజల్లో అసంతృప్తి పెరిగిపోతుందని సిపిఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ నిరసించారు. కేంద్రంలో మూడోసారి అధికారులకు వచ్చిన నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను వేగవంతంగా అమలు చేస్తున్నారని విమర్శించారు. కార్మికులకు అండగా బ్రిటిష్ కాలం నాటి 129 కార్మిక చట్టాలను నరేంద్ర మోడీ రద్దుచేసి కేవలం నాలుగు లేబర్ కోడ్‌లు తెచ్చి కార్మికుల హక్కులను కాల రాశాడని విమర్శించారు. కొత్త చట్టాల మూలంగా కార్మికులు సమ్మె చేసే హక్కు, సంఘం కట్టే హక్కు వేతనాలు అడిగే హక్కు లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక హక్కులను కాల రాసిన నరేంద్ర మోడీ ప్రభుత్వం ఎనిమిది గంటల పని విధానానికి స్వస్తి పలికి 12 గంటలు పని విధానం అమలు చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్పోరేట్ శక్తులకు ఊడిగం చేస్తుందని విమర్శించారు. పోలీసులు ఆర్పిఎఫ్ బలగాలు సిపిఎం జిల్లా కార్యదర్శిని బలవంతంగా ఎత్తుకెళ్లె ప్రయత్నంలో శ్రీనివాస్ సొమ్మసిల్లి పడిపోయారు. పోలీసులు ప్రత్యేక వ్యాన్ తీసుకొచ్చి కార్యకర్తలను బలవంతంగా వ్యానులు ఎక్కించి టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పోలీసులు బలవంతంగా సిపిఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్‌తో పాటు మరికొంతమంది 15మంది నాయకులను అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించడంతో కార్యకర్తలు ఆగ్రహించి పోలీస్ స్టేషన్ ముందు బైఠాయించి ధర్నా నిర్వహించారు. ప్రభుత్వానికి, నరేంద్ర మోడీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అరెస్ట్ చేసిన సిపిఎం నాయకులను విడుదల చేయడంతో ధర్నా విరమించారు. ఈ జైల్‌బరో కార్యక్రమంలో సిఐటియు నాయకులు, మున్సిపల్ వైస్ చైర్మన్ సుర్ణపు సోమయ్య, ఆయా సంఘాల నాయకులు సమ్మెట రాజమోళి,బానోతు సీతారాం నాయక్,కవిత, రామ్మూర్తి, కుమ్మరికుంట్ల నాగన్న, రావుల రాజు, హేమానాయక్, గుండు సులోచన, కృష్ణవేణి,యమగాని వెంకన్న, వెంకన్న ,శ్రీనివాస్, వెంకటనారాయణ ,భాగ్యమ్మ, ఉపేంద్ర, కళావతి, శ్రీనివాస్, పాల్గొన్నారు.

# ప్రైవేట్ ఎలక్ట్రిషియన్, వైండర్స్ యూనియన్ ఎన్నిక ఏకగ్రీవం

**మహబూబాబాద్ టౌన్,ఆగష్టు10,ప్రభాతవార్త:**

మహబూబాబాద్ పట్టణ ప్రైవేట్ ఎలక్ట్రిషియన్, వైండర్స్ యూనియన్ నూతన కమిటీని రాష్ట్ర అధ్యక్షులు జడల అంజయ్య ఆధ్వర్యంలో సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం జిల్లా అధ్యక్షునిగా నీరుటి వెంకన్న, కోశాధికారిగా తుమ్మలపల్లి వెంకటచారి, ప్రధాన కార్యదర్శిగా పిట్టల వేణు, కార్యదర్శిగా కేసోజు సంతోష్, గౌరవ అధ్యక్షులుగా దావూద్, గౌను యాకన్న, ఈశ్వరచారి, ఉపాధ్యక్షులుగా పూర్ణచారి, దాసరి శ్రీను, శశి, వర్కింగ్ ప్రసిడెంట్‌లుగా లచ్చిరాం, చిత్తలూరు ఉపేందర్, ముఖ్య సలహాదారులుగా వీరమల్ల లక్ష్మణ్, నూకల ఐలయ్య, సహాయ కార్యదర్శులుగా బండియాల రవి, పాల్, వేముల శ్రీను, దస్తగిరి, హలీం, మున్నా, ఇమామ్, ప్రచార కార్యదర్శులుగా వెంకన్న, దేవేందర్, నవాజ్, ముస్తఫా, శ్రీకాంత్, వెంకన్న తదితరులు ఎన్నికైయ్యారు. అనంతరం ఇటీవల అవార్డు తీసుకున్న ప్రకాష్ ఎలక్ట్రికల్ అధినేత వీరన్నను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాజు, సందీప్, రాము తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను వ్యతిరేకించాలి

**గార్ల,ఆగష్టు10,ప్రభాతవార్త:**

కేంద్రంలో మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, రైతు, ప్రజా వ్యతిరేక విధానా లను వ్యతిరేకించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు కందునూరి శ్రీనివాస్ అన్నారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తు సిఐటియు, రైతుసంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో దేశవ్యాప్త పిలుపులో భాగంగా సోమవారం ఆయా సంఘాల ఆధ్వర్యంలో మండల కేంద్రంలో జైలు భరో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పించేందు కు తీసుకొచ్చిన ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసి విబిజిరాంజీ చట్టాన్ని తీసుకురావడం వలన ప్రజలకు ఉపాధి లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక మార్కెట్ లో తక్కువ ధరకే అమ్ముకొని రైతులు దివాలా తీసే పరిస్థితి దాపురించిందని, యూరియా, పురుగు మందుల ధరలు రెట్టింపుగా పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నో ఏండ్లుగా ఎంతోమంది ప్రాణాలు పణంగా పెట్టి పోరాడి సాధించుకున్న కార్మికుల హక్కులను కాలరాసేందుకు 4 లేబర్ కోడ్ లను తీసుకువచ్చి కార్మికుల హక్కులను కాలరాస్తుందని అన్నారు. తొలుత స్థానిక సిఐటియు కార్యాలయం నుండి భారీ ప్రదర్శన, నెహ్రూ సెంటర్లో మానవహారం నిర్వహించి రోడ్డుపై బైటాయించి ఆందోళన చేపట్టారు. సుమారుగా మూడు గంటల పాటు జరిగిన ఈ ఆందోళనతో ట్రాఫిక్ భారీగా నిలిచిపోవడంతో ఎస్సై బి సాయికుమార్ ఆధ్వర్యంలో పోలీసులు సిబ్బంది ఆందోళన కారులను అరెస్టులు చేసి పోలీస్ స్టేషన్ తరలించారు. ప్రజానాట్య మండలి కళాకారుల ఆట పాటలతో నిర్వహించిన ఈ జైలు భరో కార్యక్రమం కేంద్ర ప్రభుత్వంపై వ్యతిరేక నినాదాలతో నెహ్రుసెంటర్ ప్రాంగాణం దద్దరిల్లింది. ఈ కార్యక్రమంలో సిఐటియు, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు సిహెచ్ మౌనిక, వీరస్వామి, ఇమ్మడి గోవిందు, ఉపేందర్ రెడ్డి, పెద్ద వెంకటేశ్వర్లు, ఎం నాగమణి, సిహెచ్ ఎల్లయ్య, కె.రామకృష్ణ, జే.సత్యం, బాబు, శ్రీను, అంగన్వాడి,ఆశ వర్కర్స్, గ్రామపంచాయతీ, ఆటో కార్మిక, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు పాల్గొనగా, ఈ కార్యక్రమానికి సిపిఎం మండల కార్యదర్శి అలవాల సత్యవతి, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు వీ కొండయ్య,బి శివకృష్ణలు మద్దతు తెలిపి ఆందోళనలో పాల్గొన్నారు.



# జైల్ భరో విజయవంతం



**నేలకొండపల్లి, ఆగస్టు 10 ప్రభాతవార్త:**

కేంద్రం లోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతులు, కూలీలు, ప్రజా సంఘాలకు వ్యతిరేకంగా అమలు చేస్తున్న విధానాలను నిరసిస్తూ జాతీయ కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం నేలకొండపల్లి లోని పీఎస్ఆర్ సెంటర్ నందు ఖమ్మం కోదాడ ప్రధాన రహదారిపై తెలంగాణ రైతు సంఘం, సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం, ఏఐటీయూసీ, సిపిఎం, సిపిఐ, సిపిఐ ఎంఎల్ పార్టీలు, ఇతర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆయా సంఘాల నాయకులు, కార్యకర్తలు బైఠాయించి చేపట్టిన జైల్ భరో కార్యక్రమం విజయవంతమైంది. తొలుత ఆయా ప్రజా సంఘాలు పార్టీల కార్యాలయాల నుండి కార్యకర్తలు వివిధ ప్రజా సంఘాల శ్రేణులు భారీ ప్రదర్శనగా బయలుదేరి పొట్టి శ్రీరాములు సెంటర్ కు చేరుకున్నారు. రహదారి పై వారు బైఠాయించి ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విధానాలను నిరసిస్తూ వారు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు గుడవర్తి నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కే.వి రామిరెడ్డి, సిఐటియు జిల్లా నాయకులు పగిడికత్తుల నాగేశ్వరరావు, మండల సిపిఐ కార్యదర్శి మారిశెట్టి వెంకటేశ్వరరావు, సిపిఐ ఎంఎల్ పార్టీ నాయకులు పగిడికత్తుల రామదాసు, చిర్రా బిక్షం, రైతు సంఘం మండల కార్యదర్శి రచ్చ నరసింహారావు, అధ్యక్షుడు ఇంటూరి అశోక్, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు దుగ్గి నరసింహారావు, కార్యదర్శి పెద్దపాక మల్లేశ్వరరావు, మహిళా సంఘం జిల్లా నాయకురాలు బెల్లం లక్ష్మి, మండల అధ్యక్షురాలు బలుసు ప్రమీల, నాయకులు దుగ్గి వెంకటేశ్వర్లు ఏటుకూరి రామారావు, రావెళ్ల సుదర్శన్ రావు, భూక్య కృష్ణ, ఎడ్ల తిరపారావు, మందడపు మురళీకృష్ణ, దండా సూర్యనారాయణ, డేగల వెంకటేశ్వరరావు, మారుతి కొండలరావు, యలమద్ది లెనిన్, అంగన్వాడి యూనియన్ జిల్లా నాయకురాలు కోటేశ్వరి, సామాల మల్లికార్జునరావు, తదితరులు పాల్గొన్నారు. ధర్నా ఆందోళన చేస్తున్న వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలను నేలకొండపల్లి పోలీసులు అరెస్టు చేసి అదుపు లోకి తీసుకున్నారు.

# ట్రాక్టర్ డ్రైవర్‌గా.. కౌన్సిలర్!..



**దిగబడిన మున్సిపాలిటీ ట్రాక్టర్‌ను బయటకు తీసిన బుర్ర మహేష్..**

**..5వ వార్డులో పారిశుద్ధ్య పనుల్లో ప్రత్యక్షంగా పాల్గొన్న వైనం..**

**..అభినందించిన కౌన్సిలర్ బానోత్ నాగేంద్రప్రసాద్..**

ప్రభాత వార్త ఖమ్మం రూరల్

ప్రజాప్రతినిధి అంటే కేవలం అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించడమే కాదు.. అవసరమైనప్పుడు తానే రంగంలోకి దిగి ప్రజలకు అండగా నిలవడమని నిరూపించారు ఎడులాపురం మున్సిపాలిటీ కౌన్సిలర్ బుర్ర మహేష్. పారిశుద్ధ్య పనుల్లో భాగంగా 5వ వార్డులో తిరుగుతున్న మున్సిపాలిటీ ట్రాక్టర్ మట్టిలో దిగబడటంతో.. సిబ్బంది ఇబ్బందిని గమనించిన ఆయన స్వయంగా రంగంలోకి దిగారు. ట్రాక్టర్‌ను బయటకు తీసేందుకు శ్రమించి పనులు నిలిచిపోకుండా చూశారు.

**ఆగని పారిశుద్ధ్య పనులు..**

5వ వార్డులో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు కొనసాగుతున్న సమయంలో ట్రాక్టర్ మట్టిలో దిగబడింది. దీంతో కొంతసేపు పనులకు ఆటంకం ఏర్పడింది. విషయం తెలుసుకున్న కౌన్సిలర్ బుర్ర మహేష్ అక్కడికి చేరుకున్నారు. సిబ్బందితో కలిసి ట్రాక్టర్‌ను బయటకు తీసేందుకు ప్రయత్నించారు. అవసరమైన చోట తానే ముందుండి ట్రాక్టర్‌ను బయటకు తీసుకువచ్చారు. దీంతో పారిశుద్ధ్య పనులు తిరిగి కొనసాగాయి. సాధారణంగా ప్రజాప్రతినిధులు ఇలాంటి సందర్భాల్లో అధికారులకు సమాచారం ఇచ్చి పనులు పూర్తి చేయాలని సూచించడం పరిపాటి. అందుకు భిన్నంగా కౌన్సిలర్ మహేష్ ."సమస్య పరిష్కారం కావాలి.. ఎవరు చేస్తారన్నది ముఖ్యం కాదు".. అన్న తీరులో ప్రత్యక్షంగా పనిలోకి దిగడం స్థానికుల దృష్టిని ఆకర్షించింది.

**కుర్చీలో కూర్చునే నాయకుడు కాదు.**

.ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యలను పరిష్కరించేందుకు ముందుండే మహేష్.. ఈ ఘటనతో మరోసారి తన ప్రత్యేకతను చాటుకున్నారు. కౌన్సిలర్‌గా ఉన్నప్పటికీ హోదాను పక్కనపెట్టి పారిశుద్ధ్య సిబ్బందితో కలిసి పనిచేయడం పలువురిని ఆకట్టుకుంది. ..ప్రజాప్రతినిధి అంటే ప్రజల కష్టాన్ని తన కష్టంగా భావించి స్పందించాలి.. అన్న సందేశాన్ని ఆయన తన చర్య ద్వారా ఇచ్చారని స్థానికులు పేర్కొన్నారు.

**అభినందించిన నాగేంద్రప్రసాద్**

ట్రాక్టర్ దిగబడిన విషయం తెలుసుకుని అక్కడికి చేరుకుని సమస్య పరిష్కారానికి చొరవ చూపిన కౌన్సిలర్ బుర్ర మహేష్‌ను 5వ వార్డు కౌన్సిలర్ బానోత్ నాగేంద్రప్రసాద్ అభినందించారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా పారిశుద్ధ్య పనులు సకాలంలో పూర్తయ్యేలా కృషి చేసిన మహేష్ సేవాభావాన్ని ప్రశంసించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రజాప్రతినిధులు పరస్పరం సహకరించుకుంటూ ముందుకు సాగడం అభినందనీయమన్నారు...పదవి వచ్చినా.. బాధ్యత మారలేదు. కౌన్సిలర్ అయినా.. ప్రజల కోసం అవసరమైతే ట్రాక్టర్ డ్రైవర్‌గా మారారు... సమస్య చిన్నదైనా.. పెద్దదైనా పరిష్కారం కోసం ముందుండే ఇలాంటి ప్రజాప్రతినిధులే ప్రజలకు చేరువవుతారనే అభిప్రాయం స్థానికుల్లో వ్యక్తమైంది.

# కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను వ్యతిరేకించండి

## జైల్ భరో కార్యక్రమం విజయవంతం..

**కూసుమంచి, ఆగస్టు 10(ప్రభాతవార్త ) :**



కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక రైతు ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా నాయకులు మల్లెల సన్మాతరావు పిలుపునిచ్చాడు. సోమవారం మండల కేంద్రంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జైల్ భరో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని పద్మారెడ్డి భవనం నుండి నేలకొండపల్లి రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించి, బస్టాండ్ సెంటర్లో రోడ్డుపై నిరసన కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు తోటకూరి రాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సన్మంతరావు మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్ లు, వాటి నిబంధనలను పూర్తిగా రద్దు చేయాలని, విద్యుత్ సవరణ బిల్లు 2025ను వెనక్కి తీసుకోవాలని, విద్యుత్ రంగం ప్రైవేటుకరణ నిలిపియాలని, కనీస వేతనం రూ .42,000 లను,డిఎతో అనుబంధం చేసి అన్ని రకాల కార్మికులకు, అమలు చేయాలని, విబిజి రామ్ జీ చట్టాన్ని రద్దుచేసి, ఎం.జి.ఎన్.ఆర్ఇజిఎను పునరుద్ధరించి సంవత్సరానికి 200 రోజుల పని, రోజుకు రూ .700 రూపాయలు ఇవ్వాలని, దేశ ప్రయోజనాలకు విరుద్ధమైన వాణిజ్య ఒప్పందాలను రద్దు చేయాలని, స్వామి నాథ్ కమిటీ సిఫారసుల ప్రకారం కనీస మద్దతు ధరల చట్టం చేపట్టాలని, రైతులు, పేదల కోసం సమగ్ర రుణమాఫీ అమలు చేయాలని, భూసేకరణ చట్టం 2013 సమర్థవంతంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ప్రజాసంఘాల నాయకులను, కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్ కు తరలించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి చిత్తూరు వెంకన్న, తెలంగాణ రైతు సంఘం అధ్యక్ష కార్యదర్శులు ఎడవల్లి రమణారెడ్డి,బిక్క సాని గంగాధర్,చేగొమ్మ సొసైటీ చైర్మన్ బడేటి శీను, సిఐటియు మండల అధ్యక్షుడు భూక్య హుస్సేన్, పందిరి శ్రీను, టీఎంకెఎంకెఎస్ జిల్లా కార్యదర్శి సింగం కృష్ణంరాజు, సింగం సోమయ్య, ప్రజా సంఘాల నాయకులు శీలం గురుమూర్తి చీర్ల రాధాకృష్ణ, కర్ణ బాబు , జవ్వాజి శీను, కందుల బాబు, ఎర్రబోయిన సురేష్ నిమ్మల ఉపేందర్ మామిడాల ఉపేందర్ ఎస్.కె బాబు,వెన్ను ఉపేందర్,రూప్లా నాయక్, బాసు నాయక్, ఆరుట్ల శ్రీను, వీరబాబు బెల్లం నాగేశ్వరరావు, ప్రతాప్, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.




## పలు కుటుంబాలను పరామర్శించిన రాయల



**నేలకొండపల్లి, ఆగస్టు 10 ప్రభాతవార్త:**

ఇటీవల మండ్రాజుపల్లి గ్రామంలో అస్వస్థతకు గురై ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు నెల్లూరి భద్రయ్యను సోమవారం రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు పరామర్శించారు. అనంతరం, నేలకొండపల్లి పట్టణంలో ఇటీవల మృతి చెందిన కాంగ్రెస్ నాయకుడు గుడిబోయిన సైదులు చిత్ర పటానికి ఆయన పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అలాగే, గ్రామంలో ఇటీవల మృతి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు మోర పద్మ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. మృతురాలి కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించి సంతాపాన్ని, సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి బచ్చలకూరి నాగరాజు, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జెర్రిపోతుల అంజని, నాయకులు సోమనబోయిన సాయినవీన్, కడియాల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన నవోదయ దరఖాస్తు గడువు

### ఈనెల 12 వరకు సవరణలకు అవకాశం

**కూసుమంచి, ఆగష్టు 10 (ప్రభాతవార్త ) :**

ఖమ్మం జిల్లాలోని పాలేరు జవహర్ నవోదయ విద్యాలయలో 2027 28 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశానికి గడువు ఈనెల 10 వరకు ముగిసినట్లు ప్రిన్సిపల్ సి హెచ్. వెంకటరమణసోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు అభ్యర్థులు దరఖాస్తుల్లో తప్పులను ఈనెల 12 వరకు ఎడిట్ ఆప్షన్ తో ఆన్లైన్ లో సవరించుకోవచని తెలిపారు. దరఖాస్తు ఫారం లో ఎడిట్ చేసుకోవడానికి అభ్యర్థి పేరు, తల్లి /తండ్రి పేరు, పుట్టిన తేది, లింగం, జాతీయత/కులం, చిరునామా, పాఠశాల వివరాలు వాటిని ఎడిట్ చేసుకునేందుకు అవకాశం ఉన్నట్లు, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## ఉన్న నీటిని తాగునీటికే పొదుపుగా ఉపయోగిస్తాం

### సాగర్ లో నీరు లేనందున సాగునీటికి కష్టమే

### పాలేరు జాలాయాన్ని పరిశీలించిన ఐబి ఎస్ఈ

**కూసుమంచి, ఆగష్టు 10 (ప్రభాతవార్త) :**

కూసుమంచి మండలం లోని పాలేరు జలాశయం ను ఇరిగేషన్ శాఖ



ఎస్ఈ మంగళంపూడి వెంకటేశ్వర్లు సోమవారం పరిశీలించారు. సాగర్ ఇన్ ఫ్లో కాలువ రంగుల బ్రిడ్జి వద్ద గేట్లను, పెద్ద కాలువ, పాత కాలువ గేట్లను పరిశీలించారు. ప్రస్తుతం జలాశయంలో ఉన్న నీటిని తాగునీటి కి పొదుపుగా ఉపయోగిస్తామని, వర్షాభావ పరిస్థితులు ఉన్నందున సాగర్ నుండి నీటి విడుదల లేనికారణంగా సాగునీటికి నీటిని విడుదల చేయడం కష్టమే అన్నారు. ఒకవేళ సాగర్ నుండి నీటి విడుదల జరిగితే జలాశయం పూర్తి స్థాయిలో నింపి ప్రభుత్వ ఆదేశాల మేరకు సాగునీటిని విడుదల చేస్తామన్నారు. ప్రస్తుతం నీటిని భద్రపర్చుటకు కావాల్సిన చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్ఈ తెలిపారు. ఆయన వెంట ఈఈ బాబూరావు, పాలేరు సెక్షన్ ఏఈ శ్రీరామ్ చరణ్, జేఈఈలు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఐక్యంగా గర్జించిన కార్మిక సంఘాలు

**కొత్తగూడెం జీఎం కార్యాలయం ముట్టడి..**

**12వ వేతన ఒప్పందం కోసం కార్మికుల కదనభేరి వెంటనే వేతన కమిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్**




కొత్తగూడెం, ఆగష్టు 10 ప్రభాతవార్త:

12వ వేతన కమిటీని వెంటనే ఏర్పాటు చేసి చర్చల ప్రక్రియ ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కొత్తగూడెం ఏరియా జీఎం కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ-ఐఎన్టీయూసీ-సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా, ముట్టడి కార్యక్రమం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొని కేంద్ర ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జూలై 1, 2026 నుంచి 12వ వేతన కాలపరిమితి ప్రారంభమైనప్పటికీ ఇప్పటివరకు వేతన కమిటీ ఏర్పాటుపై స్పష్టత ఇవ్వకపోవడం కార్మికుల పట్ల నిరక్ష్యమని సంఘాల నాయకులు విమర్శించారు. బొగ్గు పరిశ్రమను తమ శ్రమతో ముందుకు నడిపిస్తున్న కార్మికుల వేతనాలు, అలవెన్సులు, ఇతర ఆర్థిక ప్రయోజనాలపై వెంటనే చర్చలు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను సాకుగా చూపి వేతనాల పెంపు ప్రక్రియను ఆలస్యం చేయడం కార్మికుల హక్కులను హరించడమేనని నాయకులు పేర్కొన్నారు. కార్మిక సంఘాలను పక్కనపెట్టి వేతనాలు, హక్కులు, సంక్షేమానికి సంబంధించిన నిర్ణయాలు తీసుకుంటే ఐక్యంగా ప్రతిఘటిస్తామని హెచ్చరించారు. 12వ వేతన కమిటీ ఏర్పాటు చేసి చర్చలు ప్రారంభించే వరకు ఉద్యమం ఆగదని, అవసరమైతే సింగరేణి వ్యాప్తంగా ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, కేంద్ర కార్యదర్శి వంగ వెంకట్, ప్రచార కార్యదర్శి వీరస్వామి, బ్రాంచ్ కార్యదర్శులు గట్టయ్య, రమణమూర్తి, ఉపాధ్యక్షులు కత్తర్ల రాములు, క్రిస్టోఫర్, ఐఎన్టీయూసీ వైస్ ప్రెసిడెంట్ రజాక్, బి. రాజేశ్వరరావు, జె. రాజేశ్వరరావు, సకినాల సమ్మయ్య, అభిషేక్, కుమారస్వామి, సీఐటీయూ అధ్యక్షులు మంద నర్సింహారావు, విజయగిరి శ్రీనివాస్, వై. వెంకటేశ్వర్లు, రాజబాబు, రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.




## ఈ నెల 17 నుండి సామాజిక నాటకోత్సవాలు : మణుగూరు ఏరియా జీఎం దుర్గం రామచందర్

మణుగూరు, ప్రభాతవార్త, ఆగస్టు 10:

సింగరేణి సంస్థ మణుగూరు ఏరియా పి.వి కాలనీ కమ్యూనిటీ హాలులో ఈ నెల 17 నుండి 19 వరకు ప్రతిరోజు సాయంత్రం 6.30 నుండి రాత్రి 8.00 గంటల వరకు సామాజిక చైతన్య నాటక ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు ఏరియా జీఎం దుర్గం రామచందర్ తెలిపారు. ఆయన సోమవారం విలేకరుల తో మాట్లాడారు..హైదరాబాద్‌కు చెందిన అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో 17న "సంఘం శరణం గచ్ఛామి" (డా. బి.ఆర్. అంబేద్కర్ జీవిత విశేషాలు), 18న "సత్యశోధన" (మహాత్మా జ్యోతిరావు పూలే సామాజిక సంస్కరణలు), 19న "బుద్ధునితో నా ప్రయాణం" (గౌతమ బుద్ధుని మానవతా సందేశం) నాటకాలు ప్రదర్శించబడతాయని అన్నారు . సింగరేణి ఉద్యోగులు, విద్యార్థులు, పట్టణ ప్రజలు విశేషంగా హాజరై వీటిని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

# సెర్ఫ్ ద్వారా మహిళలకు జీవనోపాధి

**-ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాన్ని సద్వినియోగం చేసుకోండి**

**-దుమ్ముగూడెం మండలంలో టైలరింగ్ యూనిట్ కొర్రమేను పెంపకం యూనిట్లను ప్రారంభించిన ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు**




దుమ్ముగూడెం, ఆగస్టు 10 (ప్రభాతవార్త):

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సెర్ప్ ద్వారా మహిళల జీవనోపాధి పెంపొందించేందుకు అనేక ప్రోత్సాహకాలు అందిస్తుందని వాటిని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని భద్రాచలం శాసనసభ్యుడు డాక్టర్ తెల్లం వెంకట్రావు అన్నారు. సోమవారం దుమ్ముగూడెం మండలంలో పర్యటించి సెర్ప్ ద్వారా మహిళల జీవనోపాధికి సహకారం అందించిన ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాలు, టైలరింగ్ యూనిట్, కొర్రమేను చేపల పెంపకం యూనిట్లను ఆయన ప్రారంభించారు. కొత్తపల్లి గ్రామంలో మండల సమాఖ్య సిఐఎఫ్ నిధులు 3,50,000 రూపాయలతో 10 ఆధునిక మెషిన్లతో గిరిజన మహిళా యూనిఫాం కుట్టు మిషన్ కేంద్రంను ఎమ్మెల్యే ప్రారంభించారు. సింగవరం గ్రామంలో రూ 4,41,000 తో నూపా నాగలక్ష్మి శ్రీ అనే మహిళా స్వయం సహాయక సంఘం సభ్యురాలి చేత ఎస్‌బిఐ బ్యాంక్ లక్ష్మీ నగరం బ్రాంచ్ వారి ఆర్థిక సహాయంతో పిఎంఈజిపి స్కీమ్ ద్వారా ఏర్పాటు చేసిన కొరమేను పెంపకం యూనిట్‌ను డాక్టర్ తెల్లం వెంకట్రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా గత 40 సంవత్సరాలుగా భద్రాచలం ప్రాంతంలో టైలరింగ్ శిక్షణ ద్వారా ఎంతోమంది మహిళా టైలర్స్ ను తయారుచేసిన ప్రముఖ టైలర్ దాసును ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సెర్ప్ ద్వారా రాష్ట్రప్రభుత్వం పలు జీవనోపాధి కార్యక్రమాలను నిర్వహిస్తుందని వాటిని సంఘ సభ్యులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం నారాయణ రావుపేట ఆశ్రమ పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ తెల్లం సీతమ్మ, సెర్ప్ ఏపీఎం జగదీష్,సర్పంచ్‌లు కొరసా దుర్గమ్మ, నుపా నాగలక్ష్మి, మాజీ జడ్పిటిసి అన్నే సత్యనారాయణమూర్తి, దుమ్ము గూడెం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తెల్లం హరికృష్ణ, లంక శ్రీనివాసరావు, కుంజ శ్రీనివాసరావు, ముర్రం వీరభద్రం, నారాయణ రావుపేట సర్పంచ్ కల్లూరి ఆదినారాయణ, పూజారి సూరి, సునీల్, వెంకటరమణరెడ్డి, పలువురు స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, సిసిలు కోటేశ్వరరావు, వసంతరాణి, గ్రామ సమాఖ్య అధ్యక్షులు విఓఏలు మహిళలు పాల్గొన్నారు.

## నేరాల నియంత్రణలో సరిహద్దు పోలీసుల సమన్వయం

**నేర పరిశోధన నేరస్థుల సమాచారంలో తోడ్పాటు**

**మధిర లో ఖమ్మం ఎన్టీఆర్ జిల్లాల ఎసిపి స్థాయి సమన్వయ సమావేశం**

మధిర ఆగస్టు 10 ప్రభాతవార్త



నేరాలు నియంత్రణ నేరస్తుల సమాచారం కేసులు దర్యాప్తు తదితర అంశాల్లో సమన్వయంతో పనిచేయాలని ఖమ్మం ఎన్టీఆర్ జిల్లాల ఏసీపీ స్థాయి అధికారులు నిర్ణయించారు. సోమవారం మధిర పట్టణ పోలీస్ స్టేషన్ లో వైరా ఏసిపి సాదుల సారంగపాణి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్టీఆర్ జిల్లా మైలవరం ఎసిపి రామచంద్ర రావు ల నేతృత్వంలో ఇరు సబ్ డివిజన్ల పోలీస్ స్టేషన్ల సిఐలు ఎస్సై అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు.ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ సమన్వయ సమావేశంలో ప్రధానంగా తెలంగాణ-ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, ఇసుక అక్రమ రవాణా మరియు జూదం గేమింగ్ కార్యకలాపాల అరికట్టేందుకు ఇరు రాష్ట్రాల పోలీస్ అధికారుల సమన్వయం గురించి చర్చించటం జరిగింది.ముఖ్యంగా ఇసుక అక్రమ రవాణా, దొంగతనాలు, జూదం అక్రమ గేమింగ్ కార్యకలాపాలు, నేరస్తుల కదలికలు, అంతర్రాష్ట్ర నేరాలకు సంబంధించిన కేసులు తదితర అంశాలపై ఇరు రాష్ట్రాల పోలీసులు పరస్పరం సమాచారాన్ని పంచుకోవాలని నిర్ణయించారు. ఈ కార్యకలాపాలలో పాత రికార్డులలో ఉన్న నేరస్తులు కొత్తగానరిహద్దు ప్రాంతాల్లో నేరాలకు పాల్పడే వ్యక్తులు, పాల్పడే వ్యక్తుల సమాచారాన్ని పరస్పరం పంచుకుంటూ సమన్వయంతో నిఘా తనిఖీలు నిర్వహించాలని నిర్ణయించారు.అలాగే సరిహద్దు ప్రాంతాలను ఆసరాగా చేసుకొని నేరస్తులు ఒక రాష్ట్రం నుంచి మరొక రాష్ట్రానికి వెళ్లి నేరాలకు పాల్పడకుండా ఇరు రాష్ట్రాల పోలీసులు పరస్పర సహకారంతో చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలపై నిఘా పెంచడంతో పాటు, ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా ఇరు రాష్ట్రాల పరిధిలో శాంతిభద్రతలను కాపాడే దిశగా సమన్వయంతో ముందుకు సాగాలని అధికారులు నిర్ణయించారు. ఈ సమావేశంలో వైరా ఏ సి పి సారంగపాణి, మైలవరం ఏసిపి రామచంద్ర రావు మధిర రూరల్ సీఐ డి.మధు, తిరువూరు సీఐ కే.గిరి బాబు, మధిర టౌన్ ఇన్‌స్పెక్టర్ దోమల రమేష్, వైరా సీఐ వైవీ ప్రసాద్, వైరా సబ్‌డివిజన్ పరిధిలోని ఎస్ఐలు మరియు మైలవరం సబ్‌డివిజన్ పరిధిలోని ఎస్ఐలు పాల్గొన్నారు.

## ఆదివాసి దినోత్సవ విజయవంతానికి కృషి చేసిన వారికి పీవో రాహుల్ అభినందనలు

**-అధికారులు, సిబ్బంది, వాలంటీర్లు, విద్యార్థులకు ప్రత్యేక ప్రశంసలు**



భద్రాచలం,ఆగస్టు 10(ప్రభాతవార్త):

భద్రాచలం ఐటీడీఏ ఆధ్వ ర్యంలో ఆదివారం గిరిజన భవన్‌లో నిర్వహించిన ప్రపం చ ఆదివాసి దినోత్స వ కార్య క్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ఐటీడీఏ పీవో బి.రాహుల్ ప్రత్యేక అభినందనలు తెలిపారు. అంబేద్కర్ సెంటర్, పాత మార్కెట్‌లోని ఆదివాసీ మహనీయుల విగ్రహాల వద్ద కార్యక్రమాల నుంచి ర్యాలీ, గిరిజన భవన్‌లో జరిగిన వేడుకల వరకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించారని పేర్కొన్నారు.సుదూర గిరిజన ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చినా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మంచినీరు, భోజన సౌకర్యాలు కల్పించిన అధికారులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, వాలంటీర్లు, విద్యార్థిని విద్యార్థులను పీవో అభినందించారు. ర్యాలీ సందర్భంగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా సహకరించిన పోలీస్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. అందరి సమష్టి సహకారంతోనే కార్యక్రమం విజయవంతమైందని రాహుల్ పేర్కొన్నారు.